

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా


Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 178 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 29, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

# తమిళనాడు కోసం..
# గళం విప్పుతున్న సీఎం విజయ్ !

ప్రధాని మోదీతో కీలక భేటీపై దేశవ్యాప్తంగా చర్చ



రాష్ట్ర అభివృద్ధి అంశాలపై ప్రత్యేక విజన్

యువత, ఉపాధి, పరిశ్రమలపై దూకుడు నిర్ణయాలు

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న పరిపాలన

రాజకీయాల్లో కొత్త శైలితో ప్రజలకు చేరువైన నాయకత్వం

జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ

తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన అజెండాగా కేంద్ర ప్రభుత్వంతో ధైర్యంగా చర్చలు జరుపుతూ ముఖ్యమంత్రి తళపతి విజయ్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ అన్నారు. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ తో జరిగిన కీలక భేటీ అనంతరం రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర నిధులు, పరిశ్రమల విస్తరణ, యువత ఉపాధి వంటి అంశాలపై ఆయన స్పష్టమైన వైఖరి మరోసారి వెలుగులోకి వచ్చింది. ప్రజా సంక్షేమం, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణపై దూకుడుగా ముందుకు సాగుతున్న ఈ పాలన శైలి తమిళనాడు రాజకీయాల్లో కొత్త దిశను చూపుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- జై భీమ్ డెస్క్, చెన్నై

2



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## జూన్ 4లోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలి : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

యాసంగి సీజన్‌కు 24 కోట్ల గన్నీ సంచులు సిద్ధం

వర్షాల హెచ్చరికలతో కొనుగోళ్ల వేగంపై అధికారులకు ఆదేశాలు

తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా 8.5 లక్షల మంది రైతులకు రూ.10,500 కోట్ల చెల్లింపులు

6



## సమగ్ర సంక్షేమ కార్డు తీసుకురావాలి : సీఎం రేవంత్ రెడ్డి

ప్రతి పౌరుడి సంక్షేమ వివరాలు ఒకే కార్డులో అందుబాటులోకి

ఏఐ ఆధారిత విశ్లేషణతో పారదర్శకత పెంపుపై సీఎం దృష్టి

ఆరోగ్యశ్రీ నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వరకు అన్ని పథకాల అనుసంధానం

రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ పరిశీలన

అర్హులకు పథకాలు ఖచ్చితంగా చేరేలా ప్రత్యేక డ్రైవ్‌కు ఆదేశాలు



2

## చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

5

వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు

## ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా

6





# మంత్రుల పేషీల్లో ‘మామూళ్ల’ పర్వం!

## మినిస్టర్లకు చెడ్డపేరు తెచ్చేలా పీఏ,పీఎస్,ఓఎస్డీల తీరు..?

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

రాష్ట్రంలో కొందరు మంత్రుల కన్నా వారి పేషీల్లో పనిచేస్తున్న సిబ్బంది (పీఏ, పీఎస్,ఓఎస్డీ) అధిక పెత్తనం చలాయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిపార్ట్‌మెంట్‌లలో ఫైల్ క్లియరెన్స్‌లో వీరి జోక్యం మితిమీరిపోతోందని ఫిర్యాదులు అందుతున్నాయి. పేషీల్లోకి ఫైల్ ఎప్పుడు రావాలి? మంత్రి వద్దకు ఎప్పుడు వెళ్లాలి? ఆయన

- మిగతా 2లో..

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

## సమగ్ర సంక్షేమ కార్డు తీసుకురావాలి : సీఎం రేవంత్ రెడ్డి

**హైద్రాబాద్, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డు (యూనిఫైడ్ కార్డ్) రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత మేర లబ్ధి అందుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు.అందుకు అవసరమైన చర్యలను తక్షణమే ప్రారంభించాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీఎం ఆదేశించారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని సీఎం తెలిపారు. ఈ డేటాను ఏఐ సాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరడంతో పాటు అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాల వివరాలు ఈ కార్డులో ఉండాలని సీఎం సూచించారు. అవసరమైతే ఆధార్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇవ్వాలని కూడా అధికారులకు సూచించారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డుతో అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసి, మరణ ధృవీకరణ పత్రాల సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు అనుసంధానం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉపయోగపడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎన్టీఆర్ విగ్రహ ప్రారంభోత్సవానికి రూ.59 లక్షల ఖర్చు..?

**ఫుట్‌పాత్ పనులు, విగ్రహ ఏర్పాటు, ప్రారంభోత్సవానికి భారీగా ప్రజాధనం వెచ్చించినట్లు సమాచారం**



**హైద్రాబాద్, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఎన్టీఆర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజా పాలన ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు వెచ్చించినట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. విగ్రహ ఏర్పాటు, ఫుట్‌పాత్ అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవ ఏర్పాట్ల కోసం మొత్తం అక్షరాల రూ.59 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిసింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, విగ్రహం ఏర్పాటు కోసం చేపట్టిన ఫుట్‌పాత్ టెండర్ పనులకు సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఎన్టీఆర్ విగ్రహ తయారీ, ప్రతిష్ఠాపన కోసం మరో రూ.19 లక్షలు వెచ్చించినట్లు సమాచారం. ఇక ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణ, వేదికలు, అలంకరణ, సౌండ్ సిస్టమ్, ఇతర ఏర్పాట్ల కోసం దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది. ఈ మొత్తాలను కలిపి మొత్తం రూ.59 లక్షలు ప్రజాధనం వినియోగించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ నిధులతో నిర్వహించిన ఈ కార్యక్రమ ఖర్చులపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రజా ధన వినియోగంలో పారదర్శకత పాటించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడిస్తే ఖర్చులపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## రాష్ట్రంలో ఈ ఏడాది చివరికి మూడు పోర్టులు ప్రారంభం అవుతాయి: మంతెన రామరాజు

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

తెలుగుదేశం పార్టీ మహానాడు-2026 వేదికగా రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసింది. రెండో రోజు మహానాడులో భాగంగా 'రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, అమరావతి' వంటి అంశాలపై ప్రవేశపెట్టిన తీర్మానంపై ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు ప్రసంగించారు. రాష్ట్రంలో పోర్టుల నిర్మాణ పనులను వేగవంతం చేశామని, మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులను ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. రూ.29,253 కోట్ల వ్యయంతో దుగరాజపట్నంలో భారీ గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై మంతెన రామరాజు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2019-24 మధ్య కాలంలో జగన్మోహన్ రెడ్డి తన విధానాలతో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ పారిపోయేలా చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం పోర్టుల పనులను గాలికి వదిలేయడం వల్లే అనేక పరిశ్రమలు రాష్ట్రం విడిచి వెళ్లాయని, పోర్టులపై ఆధారపడిన పరిశ్రమలు నిలిచిపోయాయని అన్నారు. తమ ప్రభుత్వం ఆ పనులను ఇప్పుడు పునఃప్రారంభించిందని వివరించారు. కాకినాడ గేట్‌వే పోర్టును 2028 సెప్టెంబర్ నాటికి ప్రారంభిస్తామని, తీరప్రాంతంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ నిర్మించాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టుల అభివృద్ధిపైనా ఆయన స్పష్టత ఇచ్చారు. 2014-19 మధ్య చంద్రబాబు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రతిపాదిస్తే.. 'భోగాపురానికి ఎర్రబస్సే గతి, ఎయిర్‌పోర్టు ఎందుకు' అని వైసీపీ నేతలు ఎద్దేవా చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు తాము ఆ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తుంటే, దానిని తామే నిర్మించామని వైసీపీ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. భోగాపురం భూముల సమస్యలను మాన్సాస్ ట్రస్ట్ ద్వారా పరిష్కరించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. భోగాపురాన్ని ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 9 గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, నెల్లూరు విమానాశ్రయాన్ని పీపీపీ పద్ధతిలో టెండర్ల దశకు తీసుకొచ్చామని వివరించారు. విజన్-2047 లక్ష్య సాధనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పర్యాటక రంగంతో పాటు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని మంతెన రామరాజు ధీమా వ్యక్తం చేశారు.

# తమిళనాడు హక్కుల కోసం గళం విప్పుతున్న సీఎం విజయ్

**ప్రధాని మోదీతో కీలక భేటీపై దేశవ్యాప్తంగా చర్చ**
**రాష్ట్ర అభివృద్ధి అంశాలపై ప్రత్యేక విజన్**
**యువత, ఉపాధి, పరిశ్రమలపై దూకుడు నిర్ణయాలు**
**ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న పరిపాలన**
**రాజకీయాల్లో కొత్త శైలితో ప్రజలకు చేరువైన నాయకత్వం**
**జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ**





**జై భీమ్ డెస్క్ - చెన్నై**

తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో ధైర్యంగా మాట్లాడే నాయకుడిగా సీఎం విజయ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారని జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ అన్నారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర హక్కులు, అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతున్న ఆయన రాజకీయ శైలి ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా నిన్న ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన సమావేశం తర్వాత తమిళనాడు అభివృద్ధి అంశాలు మరోసారి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం పొందాయి. సీఎం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజలకు చేరువైన పాలన అందించడంపై విజయ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. యువత ఉపాధి, ఐటీ రంగ విస్తరణ, పారిశ్రామిక పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యా రంగ బలోపేతం వంటి అంశాలపై ఆయన ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని అభిప్రాయపడుతున్నారు.

### మోదీ, నిర్మలమ్మతో కీలక భేటీ..

నిన్న జరిగిన భేటీలో తమిళనాడు రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను సీఎం విజయ్ ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కేంద్ర నిధులు, పరిశ్రమల విస్తరణ, చెన్నై మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త రైల్వే మరియు రహదారి ప్రాజెక్టులు, యువత ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. తమిళనాడుకు రావాల్సిన ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా మాట్లాడిన నాయకుడిగా విజయ్ నిలిచారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. రాజకీయ భేదాలు పక్కనపెట్టి రాష్ట్ర అభివృద్ధే ముఖ్యమన్న సందేశాన్ని ఈ సమావేశం ద్వారా ఇచ్చారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..

అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమల పెట్టుబడులను ఆకర్షించడంపై సీఎం విజయ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. అంతర్జాతీయ కంపెనీలను తమిళనాడుకు తీసుకురావడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ఐటీ రంగాన్ని మరింత విస్తరించడం వంటి అంశాల్లో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని అధికారులు చెబుతున్నారు. చెన్నైతో పాటు ఇతర జిల్లాల్లో కూడా అభివృద్ధి సమానంగా జరిగేలా చర్యలు చేపడుతున్నారని సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, ఆరోగ్య సేవలు, విద్యా సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

### యువతలో పెరుగుతున్న ఆదరణ..

సీఎం విజయ్ తీసుకుంటున్న నిర్ణయాలు యువతలో ప్రత్యేక ఆదరణ పొందుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఉద్యోగాలు, విద్య, స్టార్టప్ అవకాశాలు, టెక్నాలజీ అభివృద్ధి వంటి అంశాలపై ఆయన దృష్టి పెట్టడం యువతను ఆకర్షిస్తోంది. ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలు వినడం కూడా ఆయనకు బలంగా మారిందని అభిప్రాయపడుతున్నారు.

### కొత్త రాజకీయ శైలి..

సాధారణ ప్రజల సమస్యలపై స్పందిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో నేరుగా మాట్లాడే ధోరణి సీఎం విజయ్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అభివృద్ధి, పారదర్శక పాలన, యువత భవిష్యత్తు అనే మూడు అంశాలనే ప్రధాన అజెండాగా తీసుకొని ముందుకు సాగుతున్న ఆయన రాజకీయ ప్రయాణం తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మంత్రుల పేషీల్లో 'మామూళ్ల' పర్వం!

మొదటి పేజీ తరువాయి

సంతకం ఎప్పుడు పెట్టాలి? మళ్లీ సెక్షన్‌కు ఎప్పుడు వెళ్లాలి? అనే అంశాల్లో పీఏ, పీఎస్‌లే చక్రం తిప్పుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ తంతు వెనుక పెద్ద ఎత్తున డబ్బుల వ్యవహారం నడుస్తోందని, అడిగినంత ముట్టచెప్పకపోతే ఫైల్ అటకెక్కుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. వీరి తీరు వల్ల మంత్రులకు పెద్ద ఎత్తున చెడ్డ పేరు వస్తోందని సచివాలయ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

### ముఖ్యాంశాలు:

వారి కనుసన్నల్లోనే ఫైళ్లు ముందుకు: పేషీ సిబ్బంది గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే ఫైళ్లు కదులుతున్నాయి. ముడుపులు ఇవ్వకుంటే కొంత్రీలు: అడిగినంత ఇస్తేనే అపాయింట్‌మెంట్ దొరుకుతుంది, లేదంటే లేనిపోని సాకులు చెబుతున్నారు.

### మెజార్టీ మంత్రుల వద్ద ఇదే పరిస్థితి..

మంత్రులకు ఉండే పని ఒత్తిళ్ల కారణంగా అన్ని విషయాలను స్వయంగా వారు చూసుకోవడం సాధ్యం కాదు. అందుకోసం పేషీ స్టాఫ్ (పీఏ, పీఎస్, ఓఎస్డీ)లను నియమించుకుంటారు. శాఖలో కావాల్సిన సమాచారాన్ని అందించడం, క్లిష్టమైన ఫైల్స్ ఉంటే వాటి పుట్టుపూర్వోత్తరాలను కనుక్కుని మంత్రులకు పీఎస్, ఓఎస్డీలు వివరిస్తుంటారు. వీరిద్దరు శాఖాపరమైన యాక్టివిటీస్‌ను ఫాలో అప్ చేస్తుంటారు. నియోజకవర్గంలోని పనుల కోసం, అక్కడ జరిగే రాజకీయ అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని మంత్రికి అలర్ట్ చేయడం, అలాగే నాయకులు, కార్యకర్తల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు పీఏలు పనిచేస్తుంటారు. కానీ, ఈ మూడు కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మంత్రులకు ఏ మేరకు మద్దతుగా ఉంటున్నారో తెలియదు గానీ, సొంత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారనే పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. 'దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్కబెట్టుకోవాలి' అన్న చందంగా అందినకాడికి దోచుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. పనికోసం వచ్చిన వారి నుంచి డిమాండ్ చేసి మరీ డబ్బులు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### ప్రతి ఫైల్‌కూ ఓ రేటు..

పలువురు మంత్రుల వద్ద పనిచేస్తున్న పీఎస్,ఓఎస్డీలు ఫైల్ క్లియరెన్స్ విషయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఫైల్ స్థాయిని బట్టి డబ్బులు అడుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఒకవేళ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని నేరుగా వెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందని బాధితులు వాపోతున్నారు.

# బక్రీద్ సందర్భంగా ఈద్గాల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన





**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

బక్రీద్ పండుగ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఈరోజు మల్కాజిగిరి బోయినపల్లి వద్ద ఉన్న ఈద్గా, సరూర్‌నగర్ కట్ట వద్ద ఏర్పాటు చేసిన ఈద్గాలను సందర్శించి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈద్గా పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భక్తుల రాకపోకలు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. బక్రీద్ ప్రార్థనలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించిన కమిషనర్, ప్రజలు పరస్పర సహకారంతో సామరస్య వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, అనురాధ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# ఇస్త్రారి బెదిరింపులు ఇంకెంతకాలం

బహుజన వాదంపై బెదిరింపులు దాడులు.
దళిత వర్గాలపై దాడులకు పాల్పడుతున్న ఇస్త్రారి.
జర్నలిస్టులను సైబర్ క్రైమ్ నేరగాళ్లు అంటున్న ఇస్త్రారి.
ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రభుత్వ సొమ్మును కాజేస్తే ఏమంటారు.
ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ మహిళను వేధించి జైలుకు వెళ్లేస్తే ఏమంటారు.
సొంత గురువు క్రిమినల్ చీటింగ్ ఫ్రాడ్ కేస్ ఎందుకు పెట్టాడు.
మాజీ ప్రిన్సిపాల్ సంతకం ఫోర్జరీకి పాల్పడినందుకు కేసు ఎందుకు నమోదైంది.
మహానగరం పేపర్లో ఆచార్య మల్లారెడ్డిపై రాసిన వార్త మరిచిపోయావా.
అసలు సైబర్ నేరగాళ్లు ఎవరో త్వరలో బయటపడబోతుంది.
అనధికార హోదాలో కొనసాగుతున్నది ఎవరు పక్కాగా బయటపడుతుంది.
వివరణ కోసం ఫోన్ చేస్తే ఫోన్ నెంబర్ ను బ్లాక్ లో పెట్టిన ఇస్త్రారి.

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్;-**

కేయూలో గౌరవప్రదమైన హోదాలో ఉంటూ మహిళలను ఆచార్యులను అసాంఘిక శక్తులంటూ జర్నలిస్టులను పనికిమాలిన రాతలు ప్రోత్సహిస్తున్న ఆచార్యులు అంటూ సంబోధించి అకుట్ గ్రూపులో మెసేజ్ పోస్ట్ చేసిన ఇస్త్రారిపై ఇటు అధికారులు గానీ అటు అకుట్ జనరల్ బాడీ గాని ఇప్పటివరకు వివిధ మైనటువంటి చర్యలు తీసుకోలేదు.ఈసీలో ఆమోదం పొందనటువంటి స్టూడెంట్ డీన్ అఫైర్స్ అనే పోస్టులో అధికారికంగా కొనసాగుతూ 2006లో ప్రభుత్వం నియామకం చేపట్టిన ఉద్యోగంలో మార్కులకు సంబంధించిన ఇంటర్వ్యూ టాబ్లెట్ షీట్ను టాంపర్ చేసి ఫోర్జరీ చేసి వేరే వ్యక్తికి రావలసిన ఉద్యోగాన్ని బలవంతంగా లాక్కొని ఉద్యోగం లోనికి చేరింది ఎవరో అతి త్వరలో బయటపడబోతోంది.సొంత గురువు విశ్రాంత ఆచార్య కృష్ణారెడ్డిపై చేసిన దుర్మార్గపు దౌర్జన్యానికి కాకతీయ బాలమిత్ర పోలీస్ స్టేషన్లో క్రిమినల్ చీటింగ్ ఫ్రాడ్,లాంటి ప్రధాన సెక్షన్స్ తో కేసులు ఎందుకు నమోదయ్యాయో నీ స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై బహిరంగ ప్రకటన చేసి నీ నిజాయితీని నిరూపించుకోవాలి.అప్పట్టి ప్రిన్సిపాల్ ఆచార్య రవీందర్ రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసినందుకుగాను అదే పోలీస్ స్టేషన్ లో ఫోర్జరీ కేసు ఎందుకు నమోదు చేయబడిందో స్టూడెంట్ అఫైర్స్ లేఖపై బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేయడమైనది.క్రైమ్ నెంబర్ 154/2011 మహిళా పరిశోధకురాలిపై ఘోరమైన వేధింపు కేసులో జైలుకు ఎందుకు వెళ్లి వచ్చావో అదే స్టూడెంట్ డీన్ ఎఫైర్స్ లేఖపై లిఖితపూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేయనైనది.హాస్టల్స్ డైరెక్టర్ గా పోతన హాస్టల్లో కొత్త మోటర్ ఎందుకు దొంగతనానికి పాల్పడ్డావో స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై బహిరంగంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేయడమైనది.సుమారు ఐదున్నర సంవత్సరాల కాలం పాటు సుదీర్ఘ కాలంగా కేయూ హాస్టల్స్ డైరెక్టర్ గా కొనసాగుతూ సెల్ఫ్ చెక్కులతో పాటు హాస్టల్స్ అకౌంట్స్ కి జమ చేయబడిన సొమ్మును ఎందుకు అవినీతికి పాల్పడ్డావో నీపై ఆచార్య డేవిడ్ కమిటీ ఎందుకు వేయబడినదో అవినీతి నిరూపణ జరిగాక ఎలా ఉద్యోగంలో కొనసాగుతున్నావో ప్రస్తుతం ఆ కమిటీ నివేదికను ఎంతటి క్రిమినల్జంతో ఎంతటి సైబర్ నేరగాళ్లు చేసే లాంటి పనితో కనబడకుండా చేశావో(మాయం చేసావో) నీ పైన ఎందుకు ఇప్పటివరకు చర్యలు తీసుకోబడలేదో నీ స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై లిఖితపూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేయాల్సి ఉందని డిమాండ్ చేయనైనది.మహిళా వేధింపుల కేసులో జైలుకు వెళ్లి వచ్చిన నీవు అసిస్టెంట్ నుండి అసోసియేట్గా అసోసియేట్ నుండి ప్రొఫెసర్గా పదోన్నతులు ఎలా పొందుకున్నావో స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై లిఖితపూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేయనైనది.ప్రొఫెసర్ అర్హత కొరకు విశ్వవిద్యాలయాన్ని తప్పుతో పట్టిస్తూ ఒకే ఆర్టికల్ ను పేరు మార్చి సమర్పించినందుకు గాను గత వీసి ఇంటర్వ్యూ కమిటీ నివేదిక ఆధారంగా పదోన్నతిని రద్దు పరుస్తూ విశ్వవిద్యాలయాన్ని తప్పుదోవ పట్టించినందుకు గాను నీపై చర్యలు చేపట్టాలని ఈసీలో నిర్ణయించగా సరిగ్గా 17 నెలల తర్వాత నీకై నీవే వినతిపత్రం పెట్టుకుని ఆచార్య మల్లారెడ్డి రిజిస్ట్రార్ గా కొనసాగుతుండగా మహానగరం పేపర్లో అతనిపై అకుట్ జనరల్ సెక్రటరీ అంటూ వార్త రాసి బ్లాక్మెయిల్ చేసి ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆచార్య మల్లారెడ్డిపై వినతి పత్రం ఇచ్చి ఈసీలో రద్దయిన పదోన్నతిని ఎలా పొందుకున్నావో భాహ్య ప్రపంచానికి తెలిసే విధంగా స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై లిఖితపూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేస్తూ నీ నిజాయితీని బలపరచుకోవాలని డిమాండ్ చేయనైనది.అదే పదోన్నతిలో ప్రస్తుత ఈసీ తప్పుడు ఆర్టికల్స్ పొందుపరిచినందుకుగాను నీపై చర్యలు తీసుకొనుట కొరకు నోటీసులు ఇవ్వాలని ఈసీలో ఆమోదింపగా దానిని ఇప్పటివరకు ముందుకు సాగకుండా ఎందుకు ఆపావో దానితోపాటు అకుట్ జనరల్ సెక్రటరీ అంటూ కాకతీయ విశ్వవిద్యాలయంపై యూజిసికి,గవర్నర్ కార్యాలయానికి,ఉన్నత విద్యా మండలి కార్యాలయానికి,రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయానికి,ఇన్ని మెయిల్స్ పంపావో,అధికారులపై విశ్వవిద్యాలయంపై ఎంత విషం గాక్కావో స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై లిఖిత్ర పూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేయనైనది.కేయూ భూములు రక్షిస్తామంటూ భూకబ్జాదారులకు ఏ విధంగా సహాయపడ్డావో జిల్లా భూ కొలతల కార్యాలయంలో భూకబ్జాదారులకు అనుగుణంగా టిఫిన్స్ మాప్స్ ఎలా సిద్ధపరిచేలా సహాయపడ్డావో అక్కడ పనిచేసిన ఏడి ,ఇన్స్పెక్టర్, మహిళ సర్వేయర్ మహిళా సిబ్బందితోపాటు ఇతర సిబ్బందీలు నీకు ఏ విధంగా సహకరించారో వాళ్లంతా ఏ ప్రాంతానికి చెందినవారో తెలియపరుస్తూ కేయూ భూములపై కబ్జాలకు పాల్పడినాడంటూ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై స్పాట్ వాయిస్ పేపర్లో వార్తలు రాయిస్తూ వాటన్నిటిని తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల పరిరక్షణ గ్రూప్ అడ్మిన్ గా ఉంటూ నీవెలా పోస్టులు పెడుతున్నావో వాటన్నిటిపై స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై లికిత పూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేయడమైనది.తెలంగాణ రాష్ట్ర హైయర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ వైస్ చైర్మన్ సెక్రటరీలు సెట్ నిర్వహణలో లక్ష రూపాయల చొప్పున 50 వేల చొప్పున డబ్బులు తీసుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల పరిరక్షణ గ్రూపులో ఎందుకు పోస్ట్ చేసావో నీ స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై లిఖితపూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేయనైనది. కేయూలో అవినీతిపరంగా సంపాదించిన సొమ్ముతో ఎన్ని ఆస్తులు కూడబెట్టుకున్నావో స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై లిఖితపూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేయనైనది.అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట్) గ్రూపులో తేది15 మే 2026 న సాయంత్రం 4 గంటల 20 నిమిషాలకు.....

కేయూ ముఖ్య కార్యాలయాల్లో అసాంఘిక శక్తులు.....

అసాంఘిక శక్తులకు భూతమిస్తున్నదెవరు....

పనికి రాణి రాతలను ప్రోత్సహిస్తున్న కేయూ ప్రొఫెసర్లు.....

అసాంఘిక శక్తుల చేతుల్లో కేయూ ముఖ్యమైన విభాగాలు.....


ప్రేక్షక పాత్రలో అధికారులు...... అంటూ మెసేజ్ ఎందుకు పోస్ట్ చేశావు కేయూ పరిపాలనలో భాగస్తులైన మహిళ, పురుష అధికారులను,అసాంఘిక శక్తుల .చేతుల్లో ముఖ్యమైన విభాగాలు అంటూ ఎందుకు సంభోదించావో అందులో మహిళలు పురుషులు వికలాంగులు ఉన్నారన్న సంగతిని మరిచిపోయి 77 మంది టీచర్ల మనోభావాలను దెబ్బ తినే విధంగా ప్రవర్తించిన నీపైన ఎందుకు కఠినమైన చర్యలు తీసుకోకూడదు స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై లిఖితపూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేయనైనది.అన్ని పత్రికలు నీ. అవినీతి అక్రమాలను ప్రచురిస్తుండగా కేవలం జై భీమ్ పత్రికపై అక్కసు వెళ్లగకుతూ ప్రభుత్వ ఉద్యోగి వనే సంగతి మర్చిపోయి నికార్స్ న జర్నలిస్టులను,నిజాయితీ కోసం పని చేసే జర్నలిస్టులను, వందల కోట్ల విలువ చేసే కేయూ భూములను కాపాడిన జర్నలిస్టులను,యూనివర్సిటీ రక్షణ కొరకు ఎన్నో కేసులు భరిస్తూ ఎన్నో మానసిక దాడులను భరిస్తూ ఎన్నో శారీరక దాడులను భరిస్తూ ఎన్నో ఆర్థిక దాడులను భరిస్తూ ఎందరో అసాంఘిక శక్తులచే బూతులు పడుతూ,బూతులు తిడుతున్నప్పటికిని భరిస్తూ చిల్లి గవ్వ పైసా ఆశించకుండా నిజాయితీగా పని చేస్తున్న జర్నలిస్టులపై అసాంఘిక శక్తులు అంటూ విషం గక్కే నీవు విశ్వవిద్యాలయ లైబ్రరీ ముందు 1000 మంది విద్యార్థుల సమక్షంలో,జర్నలిస్టులందరి సమక్షంలో,కేయూ పాలన అధికారుల సమక్షంలో,కేయూ అకుట్ సమక్షంలో,వరంగల్ పోలీస్ కమిషనర్ ,వరంగల్ పోలీస్ ,అడ్మిన్ అండ్ సెంట్రల్ జోన్ డిసిపి,కార్యాలయాల ఆధ్వర్యంలో పనిచేస్తున్న వరంగల్ పోలీస్ నిఘా విభాగం అధికారుల సమక్షంలో,వరంగల్ పోలీస్ సైబర్ క్రైమ్ అధికారుల సమక్షంలో,వరంగల్ పోలీస్ అధికారుల




సమక్షంలో,వరంగల్ పోలీస్ క్రైమ్ విభాగ అధికారుల సమక్షంలో, బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేయుచుండగా బహిరంగ చర్చకు సిద్ధమంటూ నీ స్టూడెంట్ డీన్ అఫైర్స్ లేఖపై బహిరంగ చర్చకు రావడానికి సిద్ధంగా ఉన్నాను అంటూ లిఖితపూర్వకంగా రాసి బహిరంగ ప్రకటన చేస్తూ నీవు ఉద్యోగంలో చేరినది మొదలుకొని ఇప్పటివరకు ఎలాంటి చిన్న పొరపాట్లకు పాల్పడలేదని ప్రముఖులు విద్యార్థులు పోలీస్ అధికారులు పరిశోధకులు జర్నలిస్టులు లైబ్రరీలో చదువుకుంటున్న నిరుద్యోగుల సమక్షంలో నీ నిజాయితీని నిరూపించుకోవడానికి పైన పేర్కొనబడిన ప్రతి అంశం తప్పంటూ నిరూపించి నీ గొప్పతనాన్ని విశ్వవిద్యాలయంలో చాటుకోగలవని పూర్తిగా బహిరంగ చర్చకు ఆహ్వానిస్తున్నాం జర్నలిస్టులపై విషం దక్కితే జర్నలిస్టులో చట్టాలు ఎంత భయంకరంగా ఉంటాయో అవి నీకు తారసపడ్డ రోజు నీ అసలు బండారం బయటపడుతుందన్న సంగతిని మరిచిపోవద్దని తీవ్రంగా హెచ్చరించరైనది.జై భీమ్ వార్తాపత్రికకు సంబంధించిన వార్తలను ప్రజా సమాచారం కోసం వాళ్ళ గ్రూపులలో పోస్టు చేయుచుండగా గ్రూపు అడ్మిన్ లను బెదిరింపులకు పాల్పడుతున్న ఇస్త్రారి అనే వ్యక్తి పలు గ్రూపులలో ఈ క్రింది విధంగా మెసేజ్ పెట్టిస్తూ జర్నలిస్టులను బెదిరింపులకు పాల్పడుతున్నాడనే విషయంపై జై భీమ్ పత్రిక స్టేట్ కరస్పాండెంట్(స్టేట్ బ్యూరో)డాక్టర్ దేవరకొండ నగేష్ వివరణ కోసం కేయూలో స్టూడెంట్ డీన్ అఫైర్స్ అధికారిగా పనిచేస్తున్న ఇస్త్రారికి పలుమార్లు ఫోన్ చేయగా ఫోన్ కట్ చేస్తూ సమాధానం చెప్పకుండా చివరకు జర్నలిస్టు నెంబర్ను బ్లాక్ లో పెట్టుకోవడం జరిగింది.

**ఇస్త్రారి పోస్ట్ చేయిస్తున్న మెసేజ్ ప్రియమైన అడ్మిన్,**

పదేపదే అభ్యర్థించినప్పటికీ, కొంతమంది సభ్యులు గ్రూపులో అనధికారిక, చట్టవిరుద్ధమైన వార్తాపత్రిక క్లిప్పింగ్‌లను, సంబంధం లేని కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్నారు. దీనివల్ల గ్రూపు నిర్వాహకులతో సహా సంబంధిత వ్యక్తులందరికీ చట్టపరమైన, సైబర్ సంబంధిత సమస్యలు తలెత్తవచ్చు. అటువంటి వార్తాపత్రిక క్లిప్పింగ్‌లను, అభ్యంతరకరమైన కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్న వ్యక్తులపై, ఫిర్యాదు నెం. 23705260036457తో ఎన్సిఆర్పి లో ఇప్పటికే ఒక సైబర్ ఫిర్యాదు దాఖలు చేయబడినట్లు ఇందుమూలంగా తెలియజేయడమైనది. సైబర్ నిబంధనల ప్రకారం, గ్రూపులో ఇటువంటి కార్యకలాపాలను అనుమతించినందుకు గ్రూపు అడ్మిన్‌లు కూడా బాధ్యత వహించవలసి ఉంటుంది. అందువల్ల, కేవలం అడ్మిన్‌లు మాత్రమే సందేశాలను పోస్ట్ చేయగలిగేలా గ్రూపు సెట్టింగ్‌లను తక్షణమే మార్చాలని లేదా చట్టవిరుద్ధమైన లేదా సంబంధం లేని కంటెంట్‌ను షేర్ చేయడాన్ని నిరోధించడానికి అవసరమైన ఆంక్షలను అమలు చేయాలని అభ్యర్థించడమైనది. మరిన్ని చట్టపరమైన చిక్కులను నివారించడానికి, గ్రూపు మర్యాదను, ఉద్దేశ్యాన్ని కాపాడటానికి ఈ చర్య అత్యవసరం. ధన్యవాదాలు. అంటూ కొన్ని గ్రూపు అడ్మిన్ లను తీవ్రంగా బెదిరిస్తున్నాడు.




ఇస్త్రారి అవినీతిపై చర్యలెక్కడ త్వరలో..

# జైలు నుంచి విడుదలైన పాస్టర్ అభినయ్ దర్శన్

తాను గాయపడిన సింహాన్ని
అంటూ దర్శన్ వ్యాఖ్యలు
8 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా
ఉన్న క్రైస్తవ మత ప్రచారకుడు
పోలీసులు, జైలు సిబ్బంది
గౌరవంగా చూసుకున్నారని వెల్లడి

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

తనపై తానే దాడి చేయించుకుని మతాల మధ్య విద్వేషాలను రేకెత్తించేందుకు యత్నించాడనే ఆరోపణతో అరెస్ట్ అయిన క్రైస్తవ మత ప్రచారకుడు అభినయ్ దర్శన్ నర్సీపట్నం సబ్ జైలు నుంచి విడుదలయ్యారు. 8 రోజుల పాటు జైల్లో ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. జైలు నుంచి విడుదల అయిన తర్వాత ఆయన ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పోలీసులు, జైలు సిబ్బంది తనను గౌరవంగా చూసుకున్నారని దర్శన్ తెలిపారు. విచారణలో కూడా మర్యాదగా వ్యవహరించారని... తనపై చేయి చేసుకోలేదని చెప్పారు. జైల్లో కూడా జైలు సిబ్బంది, ఖైదీలు తనను ఇబ్బందులకు గురి చేయలేదని తెలిపారు. తన పాదయాత్ర ఆగిపోతుందంటూ వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ... పాదయాత్రకు విరామం ఉండదని, పాడేరు నియోజకవర్గం నుంచే పాదయాత్రను కొనసాగిస్తానని తెలిపారు. తాను గాయపడిన సింహం వంటి వాడినని... మరింత కసితో వేట మొదలు పెడతానని అన్నారు. ప్రజల కోసం పోరాటానికి తాను ఎప్పుడూ సిద్ధమేనని చెప్పారు.

# పాలకుర్తిలో నేడే మెగా జాబ్ మేళా

పాలకుర్తి నియోజక వర్గ నిరుద్యోగ యువతకు సదవకాశం
నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తున్న టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రెడ్డి





**పాలకుర్తి(జై భీమ్ న్యూస్)**

పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర కళ్యాణ మండపంలో హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రేపు నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లను ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్,టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు ఆమె సూచించారు. నమోదు కౌంటర్లు,కంపెనీల స్టాల్స్, ఇంటర్వ్యూ హాల్స్, తాగునీటి వసతి, కూర్చునే ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రేపు నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

# శ్రీరామ్ రమేష్ మృతి పాత్రికేయ లోకానికి తీరని లోటు

**వర్ధన్నపేట, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**



వర్ధన్నపేటకు చెందిన సీనియర్ పాత్రికేయుడు, ఆంధ్రజ్యోతి విలేకరి శ్రీరామ్ రమేష్ గుండెపోటుతో మృతి చెందడం పాత్రికేయ లోకానికి తీరని లోటుగా పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు. గత 25 ఏళ్లకు పైగా ఆంధ్రజ్యోతి పత్రికలో సేవలందించిన రమేష్ మృతి పట్ల సహచర పాత్రికేయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రమేష్ పార్థివ దేహానికి ఆంధ్రజ్యోతి వరంగల్ ఎడిషన్ ఇంచార్జి శంకేసి శంకర్రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్ తడక రాజు నారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ రమేష్ నిబద్ధత కలిగిన జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారని కొనియాడారు. పాత్రికేయ వృత్తిలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి పాత్రికేయులు నరేందర్, సదానందం, సమ్మయ్య, పృధ్వి, ముక్కెర రమేష్, మోహన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పాత్రికేయులు, మిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై రమేష్‌కు నివాళులర్పించారు.

# చంద్రబాబు బూట్లు ఎప్పుడు తుడుస్తావ్? కొడాలి నానికి వెనిగండ్ల రాము ప్రశ్న

53 వేల ఓట్లతో ఓడిపోయినా నానికి బుద్ధి రాలేదన్న వెనిగండ్ల రాము
గుడివాడ ప్రజలు నానిని ఎప్పుడో మర్చిపోయారని ఎద్దేవా
సిగ్గు, శరం లేకుండా విమర్శలు చేస్తున్నాడని మండిపాటు

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానిపై టీడీపీ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో చంద్రబాబు గెలిస్తే ఆయన బూట్లు తుడుస్తానని కొడాలి నాని అన్నారని... ముందు చంద్రబాబు బూట్లు తుడిచిన తర్వాతే కొడాలి నాని రాజకీయాల గురించి మాట్లాడాలని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొడాలి నాని కార్పొరేటర్ గా కూడా గెలవలేదని... ఇది తన సవాల్ అని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొడాలి నానిని గుడివాడ ప్రజలు 53 వేల ఓట్లతో చిత్తుగా ఓడించారని... అయినా ఆయనకు బుద్ధి రాలేదని రాము అన్నారు. విజయవాడలో మీడియా ముందు మాట్లాడటం కాదని... దమ్ముంటే గుడివాడలో అడుగు పెట్టాలని సవాల్ విసిరారు. గుడివాడలో నాని సీటు గల్లంతయిందని... అసలు ఆయన గురించి మాట్లాడటం కూడా వేస్ట్ అని చెప్పారు. గుడివాడ ప్రజలు నానిని ఎప్పుడో మర్చిపోయారని అన్నారు. జనాలు ఛీ కొడుతున్నా కొడాలి నాని సిగ్గు, శరం లేకుండా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కొడాలి నాని... చంద్రబాబు బూట్లు ఎప్పుడు తుడుస్తావో చెప్పు అని ప్రశ్నించారు. గుడివాడ రాజకీయాలపైనే పట్టు లేని కొడాలి నానికి రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడటం అవసరమా? అని ఎద్దేవా చేశారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# క్రాంతి కార్‌కు జోహార్

గొప్ప మానవతా వాదిని కోల్పోయాం.

**ఖమ్మం జై భీమ్ న్యూస్:-**

పదునైన కలం, సునిశిత విమర్శ , సరళత, పాఠకుడిని ఆకర్షించి, చదివించే లక్షణం క్రాంతి కార్ కలం స్వంతం. మార్కిస్టు ఉద్యమాలలో ఒక పూర్తి కాలం కార్యకర్తగా పని చేసి, అనేక మంది పైన ప్రభావం కలిగించిన వాడు క్రాంతి కార్. ఆనాటి ( 1970 ల నాటి) కొండపల్లి సీతారామయ్య గారి సిపిఐయంయల్ పార్టీ పత్రికలు క్రాంతి, పిలుపు తదితర పత్రికలను ఆకర్షణీయంగా నడిపిన వ్యక్తి క్రాంతి కార్.తర్వాత ఆ ఉద్యమం నుండి బయటకు వచ్చి హేతువాద ఉద్యమంలో క్రియాశీల కార్యకర్తగా , నాయకుడిగా , రచయితగా కొనసాగారు. హేతువాదం పత్రికను ఆకర్షణీయంగా కొన్ని దశాబ్దాలు నడిపారు.సిపిఐయంయల్ ఉద్యమాల నుండి బయటకు వచ్చి వాటికి వ్యతిరేకంగా కొంత మంది మారారు.కానీ, క్రాంతి కార్ అలాటి వ్యతిరేకిగా మారలేదు. ఆ ఉద్యమం పట్ల ప్రేమ, అభిమానాలతో , కొన్ని భిన్నాభిప్రాయాలు కలిగిన వ్యక్తిగా కొనసాగారు.మారిన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా, సామాజిక న్యాయం,కుల నిర్మూలన వంటి అంబేద్కర్, పూలే ఆలోచనల పట్ల సానుకూల వైఖరిని క్రాంతి కార్ ఏర్పరచుకుని, కొనసాగించారు. గత 20 సంవత్సరాల నుండి వినికిడి సమస్యతో బాధ పడుతూ , మిత్రులు చెప్పే విషయాలు సగం అర్థం అయ్యీ, సగం అర్థం కాని స్తితిలో ఇబ్బంది పడే వారు. అయినప్పటికీ ఓపికగా మరీ మరీ అడిగి తెలుసుకునే వారు. తాను చెప్పాలి అనుకున్న విషయాలు సూటిగా, నిష్కర్షగా చెప్పేవారు. ఇతరులు అంగీకరించినా , అంగీకరించక పోయినా తన అభిప్రాయాలు సూటిగా చెప్పే వారు. ఇతరుల మంచి మాటలను స్వీకరించే ప్రజాస్వామిక లక్షణాలు కలిగి ఉండే వాడు. ప్రజల మీద , ప్రజా ఉద్యమాల మీద విపరీతమైన ప్రేమ ; మిత్రుల పట్ల గౌరవ - మర్యాదలు కలిగి ఉండేవారు.హేతువాద ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించటంలో కీలకమైన పాత్ర పోషించారు. మూఢ విశ్వాసలకు వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వారి మరణం హేతువాద, నాస్తిక, ప్రజాస్వామిక ఉద్యమాలకు తీరని



లోటు అని వరంగల్ జిల్లా నునుండి హేతువాద సంఘ రాష్ట్ర నాయాకురాలు రమాదేవి ఒక ప్రకటనలో సంతాపం తెలుపుతూ వారికి జోహార్లు తెలిపారు.తను మరణం పొందిన తర్వాత తన పార్టీవదేహాన్ని ఖమ్మం మెడికల్ కళాశాలకు అప్పగించాలని తన మృతదేహంపై ముందస్తుగానే లిఖితపూర్వకంగా రాసిచ్చి తన గొప్పతనాన్ని చాటుకున్నారు.

# నిష్పక్షపాత సేవలతో ప్రజల విశ్వాసం పొందాలి

మిల్స్ కాలనీ నూతన సీఐ కర్రే స్వామికి
మాల మనాడు నాయకుల ఘన స్వాగతం




**వరంగల్, 28 మే 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ కర్రే స్వామిని గ్రేటర్ వరంగల్ మాల మనాడు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కొత్త బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీఐకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మాల మనాడు అధ్యక్షులు అంకేశ్వరపు రామచంద్ర రావు, సీనియర్ నాయకులు మన్నే బాబురావు ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని, ముఖ్యంగా నిరుపేదలు, బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, చట్టపరంగా న్యాయం చేయడంలో ఎలాంటి వివక్ష చూపకుండా పనిచేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. న్యాయం ఎటువైపు ఉంటే అటువైపే నిలబడి, కులమతాలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలి అని వారు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాన్య ప్రజలకు భరోసా కల్పించే విధంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సీఐ కర్రే స్వామి మాల మనాడు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజా సేవే తన ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా న్యాయం అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాల మనాడు సంఘానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సిద్దాపూర్, అర్వపల్లి ధాన్య కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్




**హసన్‌పర్తి, 28 మే 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దాపూర్, అర్వపల్లి గ్రామాల ఐకేపీ ధాన్య కొనుగోలు కేంద్రాలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. మహేందర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్య కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం, నాణ్యతా తనిఖీలు, చెల్లింపుల వ్యవస్థ తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. కేంద్రాలకు వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడిన ఇన్‌స్పెక్టర్, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించే సమయంలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు సమయానుకూలంగా చెల్లింపులు అందేలా చూడాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి రైతులకు సహకరించాలని తెలిపారు. ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

# ఈద్గా వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలించిన సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, 28 మే 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**




బక్రీద్ పండుగను పురస్కరించుకొని హన్మకొండ బొక్కలగడ్డ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈద్గా పరిసర ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హన్మకొండ ఏసీపీ నర్సింహారావుతో మాట్లాడి భద్రతా చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కామ్రేడ్ బండారి చిరంజీవి ఆశయ సాధనకు ఉద్యమించాలని పిలుపు



**దామెర, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

అమరజీవి కామ్రేడ్ బండారి చిరంజీవి ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం చేయాలని ఎం.సి.పి.ఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు గోనే కుమారస్వామి పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా దామెర మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన కామ్రేడ్ బండారి చిరంజీవి 3వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎం.సి.పి.ఐ(యు) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం నాగార్జున అధ్యక్షత వహించారు. సభకు ముందు గ్రామంలోని చిరంజీవి స్తూపం వద్ద నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోనే కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంసారెడ్డి మాట్లాడుతూ బండారి చిరంజీవి గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని, అవినీతి అక్రమాలపై పోరాడిన ప్రజా నాయకుడని కొనియాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ, విద్యారంగ సమస్యలపై జరిగిన పోరాటాల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులు ఆందోళనకరంగా మారాయని నాయకులు పేర్కొన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, గ్రామీణ ఉపాధి హామీ పథకం సమర్థ అమలు, కనీస వేతనం రూ.26 వేలు, మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రజా సమస్యలపై జూన్ 1 నుంచి 7 వరకు గ్రామ, మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ఆందోళనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, జిల్లా నాయకులు కర్ర రాజిరెడ్డి, చీపురు ఓదయ్య, ఎండి ఉస్మాన్, వక్కల కిషన్, మంద భద్రయ్య, దామర కొండ రమేష్, చిరంజీవి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాహిత్య వైభవానికి సురవరం సేవలు చిరస్మరణీయం

తెలుగు శాఖ అధ్యక్షులు డా. మామిడి లింగయ్య




**వరంగల్, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

నవయుగ వైతాళికుడు, ప్రముఖ చరిత్రకారుడు, జర్నలిస్టు, తెలంగాణ సాహిత్యాభివృద్ధికి విశిష్ట సేవలందించిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అధ్యాపకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలుగు భాష, తెలంగాణ చరిత్ర, సాహిత్య రంగాలకు అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు డా. మామిడి లింగయ్య మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ సాహిత్య చరిత్రకు చిరస్మరణీయ సేవలు అందించారని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, భాషా వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడిగా ఆయన నిలిచిపోయారని అన్నారు. పాలక మండలి సభ్యులు, తెలుగు శాఖ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు డా. చిర్ర రాజు మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి రచనలు నేటి తరానికి మార్గదర్శకాలని తెలిపారు. ఆయన ఆలోచనలు సమాజ చైతన్యానికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డా. కర్రె సదాశివ్, డా. బానోత్ స్వామి, డా. నాగరాజు పటేల్ తదితరులు పాల్గొని సురవరం ప్రతాపరెడ్డి సేవలను కొనియాడారు.

# ఆపదలో అండగా నిలిచిన బాల్య మిత్రులు



**హన్మకొండ జిల్లా/ధర్మసాగర్, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన చెట్ల మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. కుటుంబానికి ఆధారంగా నిలిచిన మహేష్ అకాల మరణంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు మానవత్వంతో స్పందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులు మహేష్ కుటుంబ పరిస్థితిని తెలుసుకుని పరస్పరం చర్చించి సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. గురువారం మహేష్ ఇంటికి వెళ్లిన స్నేహితులు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మహేష్ భార్య, తల్లిదండ్రులు, తమ్ముడిని ఓదారుస్తూ కష్టకాలంలో తాము తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా స్నేహితులు కలిసి రూ.45 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. స్నేహానికి అర్థం కేవలం మాటల్లో కాకుండా అవసర సమయంలో అండగా నిలబడటంలోనే ఉందని వారు పేర్కొన్నారు. మహేష్ ఎంతో మంచివాడని, అందరితో ఆప్యాయంగా మెలిగేవాడని గుర్తు చేసుకున్నారు. పాఠశాల రోజుల్లో కలిసి గడిపిన అనేక మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. జీవితంలో నిజమైన స్నేహం విలువ ఇలాంటి సందర్భాల్లోనే బయటపడుతుందని, స్నేహితులు చూపిన సహకారం మహేష్ కుటుంబానికి ఎంతో ధైర్యాన్నిచ్చిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. చిన్ననాటి మిత్రులు కలిసి చేసిన ఈ సహాయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు ప్రశంసించారు.

# ధాన్యం కొనుగోళ్లపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

**హన్మకొండ, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఉమ్మడి వరంగల్ జిల్లా వరి ధాన్యం కొనుగోలు కార్యకలాపాలపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ కుడా ఛైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశానికి రాష్ట్ర నీటిపారుదల, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతంగా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రులు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, రవాణా, నిల్వ వంటి అంశాల్లో సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన అవగాహన పోస్టర్లను మంత్రులు, ప్రజాప్రతినిధులు కలిసి విడుదల చేశారు.



# స్థానిక కార్మికుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది : నేదునూరి సునీల్

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జోక్యంతో ఎల్‌పీసీ కంపెనీలో కార్మికులకు న్యాయం**

**హన్మకొండ జిల్లా/హసన్‌పర్తి, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఎల్లాపూర్ గ్రామంలోని ఎల్‌పీసీ కంపెనీలో తొలగించబడిన స్థానిక కార్మికుల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవతో కంపెనీ యాజమాన్యం తిరిగి కార్మికులను విధుల్లోకి తీసుకోవడానికి అంగీకరించింది. దీంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యుల్లో ఆనందం వ్యక్తమైంది. ఇటీవల కంపెనీలో పనిచేస్తున్న సుమారు 30 మంది స్థానిక కార్మికులను విధుల నుంచి తొలగించి, వారి స్థానంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులను నియమిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. గత 40 సంవత్సరాలుగా కంపెనీలో పనిచేస్తూ కుటుంబాలను పోషిస్తున్న తమను ఒక్కసారిగా తొలగించడం అన్యాయమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎల్లాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేదునూరి సునీల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్మికులు కలిసి కంపెనీ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక కార్మికులకు న్యాయం చేయాలని, ఇతర రాష్ట్రాల కార్మికులతో స్థానికుల ఉపాధిని దెబ్బతీయవద్దని నినాదాలు చేశారు. కంపెనీ యాజమాన్యం స్థానిక కార్మికులపై వివక్ష చూపుతోందని ఆరోపిస్తూ, తొలగించిన కార్మికులను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వెంటనే స్పందించి కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న స్థానిక కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కార్మికులు, కాంగ్రెస్ నాయకులు, కంపెనీ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా ముగియడంతో తొలగించబడిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ సందర్భంగా ఎల్లాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేదునూరి సునీల్ మాట్లాడుతూ, స్థానిక కార్మికుల సమస్యను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బాధ్యతగా తీసుకుని వెంటనే స్పందించడం అభినందనీయమన్నారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో కూడా స్థానిక కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ ఉపాధ్యక్షులు తంగళ్లపెల్లి తిరుపతి, తోకల లక్ష్మారెడ్డి, వీసం సురేందర్ రెడ్డి, ఎర్ర ప్రకాష్, ఎరుకొండ శ్రీనివాస్, కనకర్తి కిరణ్, గొర్రె కిరణ్, భాషబోయిన కుమారస్వామి, గంగిళ్ల మధుసూదన్ రెడ్డి, రేణుకుంట్ల రాజయ్య (సీపీఐ), నేదునూరి సాంబయ్య, వీరబోయిన తిరుపతి, బొద్దిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, నేదునూరి శ్రీనివాస్, రాజేష్, మహేందర్, అనిల్, దామెర రాజేందర్‌తో పాటు తొలగించబడిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# బడి బాటలో మద్యం బాట..!

**హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల తాగుబోతులకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు**

**పాఠశాల ప్రాంగణంలో మద్యం సీసాలు కలకలం**

**పిల్లల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన**





**హన్మకొండ, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోందన్న ఆరోపణలు గ్రామంలో ఆందోళన కలిగిస్తున్నాయి. పిల్లలు విద్యను అభ్యసించాల్సిన పవిత్రమైన విద్యాలయం రాత్రి వేళల్లో తాగుబోతుల అడ్డాగా మారిందని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు కనిపించడం ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పాఠశాల వరండాలో మద్యం బాటిళ్లు కనిపించడం స్థానికులను కలవరపరిచింది. రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించి మద్యం సేవిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు విద్యార్థులు చదువుకోడానికి వచ్చే తరగతి గదుల సమీపంలోనే మద్యం సీసాలు కనిపించడం తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఉదయం స్కూల్‌కు వచ్చే చిన్నారులు మద్యం సీసాలు, చెత్తను చూసి భయపడుతున్నారని గ్రామ ప్రజలు చెబుతున్నారు. పాఠశాల వాతావరణం కలుషితమవుతుండటంతో పాటు విద్యార్థులపై చెడు ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి పాఠశాల వద్ద రాత్రి పహారా ఏర్పాటు చేయాలని, పాఠశాల ప్రాంగణంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్కూల్ అంటే చదువుల తల్లి... అలాంటి పవిత్ర స్థలాన్ని మందుబాబుల అడ్డాగా మార్చడం దురదృష్టకరం అంటూ గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# త్యాగానికి, ప్రేమకు ప్రతిరూపం బక్రీద్ : మంత్రి కొండా సురేఖ

**వరంగల్, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**





మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బీనగర్, మట్టేవాడ, ఫోర్ట్ వరంగల్ ఈద్గాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి కొండా సురేఖతో పాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భం గా ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్ రావులను శాలువాలతో సత్కరించి ఘనంగా గౌరవించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమకు, విశ్వాసానికి, అల్లాహ్‌కు విధేయతకు ప్రతీక అని పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యులుగా భావించి ఈద్గా ప్రార్థనలకు ఆహ్వానించిన ముస్లిం మత పెద్దలకు, కమిటీ సభ్యులకు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మైనార్టీలకు కల్పించిన రిజర్వేషన్ల ద్వారా ఎంతోమంది ముస్లింల జీవితాల్లో మార్పు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించిన మంత్రి సురేఖ, తెలంగాణ రాష్ట్రంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# చరిత్రలో ఎవరూ కదిలించలేని విధంగా అమరావతికి చట్టబద్ధత తీసుకొచ్చాం

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలంటే కేంద్ర సహకారం తప్పనిసరి అని నమ్మిన నాయకుడు చంద్రబాబు అని, ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం పూర్తి అండగా నిలుస్తోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో జరుగుతున్న మహానాడు-2026 రెండో రోజున 'రాష్ట్రానికి కేంద్ర సహాయం' అనే తీర్మానంపై ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.15,000 కోట్లు కేటాయించినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వం సంకెళ్లతో బంధించిన అమరావతిని, తమ సంకల్పంతో సాధించుకున్నామని, చరిత్రలో ఎవరూ కదిలించలేని విధంగా అమరావతికి చట్టబద్ధత తీసుకొచ్చామని పెమ్మసాని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి 30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. 2014-19 మధ్య 70 శాతం పనులు పూర్తయితే, గత వైసీపీ ప్రభుత్వం కేవలం 5 శాతం పనులు మాత్రమే చేసిందని విమర్శించారు. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కు కోసం కేంద్రం రూ.11,400 కోట్లు సాయం చేసిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని, కూటమి ప్రభుత్వం రూ.12,000 కోట్లు చెల్లించి 82 కేంద్ర పథకాలను పునరుద్ధరించిందని వివరించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.600 కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం రూ.4,000 కోట్లతో పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసిందని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు**

**ఇసుక రవాణా వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులకు ఆదేశం**



**పెద్దపల్లి, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

రైతులు తీసుకొచ్చే చివరి గింజ వరకూ ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు చేస్తామని తెలిపారు. గురువారం పెద్దపల్లి ఐడీఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ఇంకా 15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని హామీ ఇచ్చారు. గతంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు, వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు ఇస్తామని తెలిపారు. రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు ఇసుక రవాణాను నిలిపివేసి, ఆ వాహనాలను పూర్తిగా ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8575 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా, ఎఫ్‌సీఐ కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందన్నారు. ఎఫ్‌సీఐ కేటాయింపులకు మించి అదనంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని వెల్లడించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. రైతుల నుంచి ఒక్క కేజీ ధాన్యం తరుగు తీసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ, ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున ధాన్యం పెద్దపల్లికి వస్తోందని, అందుకు అనుగుణంగా రైస్ కేటాయింపులు పెంచాలని కోరారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు రూ.788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జూన్ 5 నాటికి 100 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, జిల్లాలో లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 185 కొనుగోలు కేంద్రాల ద్వారా 65 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అధికారులు, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.




# మహానాడు సంచలన రికార్డు సృష్టించింది: నారా లోకేశ్

**మహానాడుకు 11 లక్షల మంది హాజరయ్యారన్న నారా లోకేశ్**

**వీరంతా ఈ-అటెండెన్స్ లో నమోదు చేయించుకున్నారని వెల్లడి**

**అన్ని నియోజకవర్గాల్లో మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామన్న లోకేశ్**

**రాజారెడ్డి అరాచకాలను ప్రజలకు తెలియజేసిన ఘనత జగన్ దేనని వ్యాఖ్య**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



తొలిసారి హైబ్రిడ్ మోడల్ లో నిర్వహిస్తున్న మహానాడు సంచలన రికార్డు సృష్టించిందని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మహానాడు కార్యక్రమాలకు 11 లక్షల మంది క్యాడర్ హాజరయ్యారని ఆయన వెల్లడించారు. ఈ-అటెండెన్స్ లో వీరంతా నమోదు చేయించుకున్నారని తెలిపారు. మహానాడులో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని లోకేశ్ అన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచే ఎప్పటికప్పుడు మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సిద్ధాంత పరంగానే తాము సంస్కరణలు తీసుకొస్తున్నామని... ఎన్నికల కోసం కాదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని వెల్లడించారు. జెన్ జీ యువత ఏం ఆశిస్తుందో ఆలోచించి దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ సిద్ధంగా ఉందని లోకేశ్ తెలిపారు. జగన్ మాదిరి తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోబోమని చెప్పారు. టీడీపీ ప్రజాస్వామ్యబద్ధంగానే ముందుకు సాగుతుందని అన్నారు. జగన్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల పేపర్లను లాక్కుని ఎలాంటి అరాచకాలకు పాల్పడ్డారో అందరం చూశామని చెప్పారు. డీఎస్సీపై జగన్ వేయించిన కేసులన్నింటినీ కోర్టు కొట్టివేసిందని తెలిపారు. జగన్ తన కుటుంబ చరిత్రను తానే తవ్వి తీయించారని లోకేశ్ ఎద్దేవా చేశారు. రాజారెడ్డి అరాచకాలు, బెరైటీస్ గనుల కోసం చేసిన హత్యలు అన్నింటినీ ప్రజలకు తెలియజేసిన ఘనత జగన్ దేనని అన్నారు.

# అన్న క్యాంటీన్లను ఎత్తివేయొద్దని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా జగన్ వినలేదు: అచ్చెన్నాయుడు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు గుప్పించారు. మహానాడులో ఆయన మాట్లాడుతూ... జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని అన్నారు. ఏ రాష్ట్రానికైనా పరిశ్రమల ద్వారానే ఆదాయం, ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 24 నెలల కూటమి పాలనలో రాష్ట్రానికి రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. పేదలకు రూ. 5కే కడుపు నింపే అన్న క్యాంటీన్లను ఎత్తివేయొద్దని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా.. ఆనాడు జగన్ వినిపించుకోలేదని అచ్చెన్న విమర్శించారు. అన్న క్యాంటీన్లను తొలగించారని దుయ్యబట్టారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకే జగన్ మూడు రాజధానులు అన్నారని విమర్శించారు. మూడు ప్రాంతాల్లోనూ ఎన్నికల్లో జగన్ కు ఎదురుదెబ్బ తగిలిందని ఎద్దేవా చేశారు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ఏపీలో ఎంతో అభివృద్ధి జరిగిందని... కానీ దాన్ని మనం చెప్పుకోలేదని అచ్చెన్న అన్నారు. అదే సమయంలో జగన్ చెప్పిన అబద్ధాలను ప్రజలు నమ్మడంతో 2019లో టీడీపీకి నష్టం జరిగిందని చెప్పారు. ఈసారి ప్రజలకు అలాంటి ఛాన్స్ ఇవ్వొద్దని... మన ప్రభుత్వం చేసిన మంచి పనులను, అభివృద్ధిని ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలని అన్నారు.

జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

# ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

గురువారం సాయంత్రం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా గవర్నర్ ను కలిసి రాజీనామా లేఖను సమర్పించారూ తర్వాత ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగిన నేను, ఒకనాడు ఎమ్మెల్యేగానో, మంత్రిగానో, ప్రతిపక్ష నాయకుడిగానో, లేదా ఈ రాష్ట్రానికి రెండు మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగానో అవుతానని కలలో కూడా ఊహించలేదు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పుణ్యమా అని ఇంతటి విలువైన కల నిజమైంది. బుద్ధ, బసవ, బాబాసాహెబ్ మరియు మహాత్మా గాంధీ నా ఆదర్శాలు. నా నలభై ఎనిమిది సంవత్సరాల రాజకీయ జీవితంలో, దేశంలోని అణగారిన, దోపిడీకి గురైన మరియు పేద ప్రజల కోసం నిజాయితీగా పనిచేశానన్న సంతృప్తి నాకు ఉంది. నన్ను శాసనసభ పక్ష నాయకుడిగా ఎన్నుకుని, ఇంతకాలం ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన పార్టీ ఎమ్మెల్యేలకు, నాతో భుజం భుజం కలిపి పనిచేసిన కేబినెట్ సహచరులకు, నాకు ఈ అవకాశం ఇచ్చిన పార్టీ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలకు, మరియు నా రాజకీయ జీవితమంతా నన్ను ప్రేమించి, ఆరాధించి, మార్గనిర్దేశం చేసిన దయగల కన్నడిగులకు నేను ఎప్పటికీ కృతజ్ఞుడనై ఉంటాను. రాజ్యాంగమే నా మతం, ప్రజలే నా దేవుళ్ళు. నా రాజీనామా కేవలం ముఖ్యమంత్రి పదవికి మాత్రమే పరిమితం, క్రియాశీల రాజకీయాలకు కాదు. నా చివరి శ్వాస వరకు సామాజిక న్యాయం కోసం మరియు రాజ్యాంగ వ్యతిరేక మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడతాను అన్నారు. ఈ సందర్భంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వర్ మరియు పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు ఉన్నారు.

# పవన్ వల్లే ఉద్యోగం, భూమి..

ఆ లాజిక్ ఎలా మిస్ అయ్యారు?

సుగాలి ప్రీతి తల్లికి హైపర్ ఆది సూటి ప్రశ్న

సుగాలి ప్రీతి తల్లి విమర్శలకు హైపర్ ఆది కౌంటర్

పవన్ ప్రశ్నించిన తర్వాతే మీ కుటుంబానికి సాయం అందిందని వెల్లడి

ఓట్ల కోసం పోరాడే వ్యక్తి ద పవన్ కల్యాణ్ కాదని వ్యాఖ్య

పక్కవాళ్ల మాటలు విని పవన్‌ను నిందించవద్దన్న ఆది

పాలు పోసిన వ్యక్తినే కాటేయడం సరికాదని హితవు

**కర్నూలు, జై భీమ్ న్యూస్**

కర్నూలు జిల్లాకు చెందిన సుగాలి ప్రీతి కేసు వ్యవహారం ఏపీ రాజకీయాల్లో మరోసారి దుమారం రేపుతోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సుగాలి ప్రీతి తల్లి చేసిన విమర్శలకు జనసేన నేత, సినీ నటుడు హైపర్ ఆది ఘాటుగా స్పందించారు. పక్కవాళ్ల మాటలు విని, పవన్ కల్యాణ్ లాంటి వ్యక్తిని విమర్శించడం తగదని హితవు పలికారు. సాయం చేసిన వ్యక్తినే నిందించే మనస్తత్వం ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ఇటీవల సుగాలి ప్రీతి కుటుంబ సభ్యులు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసి, తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదని, ఓట్ల కోసమే ఈ అంశాన్ని వాడుకున్నారని ప్రీతి తల్లి ఆరోపించారు. ఈ నేపథ్యంలో హైపర్ ఆది ఒక వీడియో ద్వారా స్పందించారు. "అమ్మా.. మీరు మీ పాప కోసం పోరాడుతున్నప్పుడు ఏ ప్రభుత్వమైనా స్పందించిందా? పవన్ కల్యాణ్ గారు ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాతే దేశం మొత్తం తెలిసింది. ఆయన ప్రశ్నించిన తర్వాతే భయపడి అప్పటి ప్రభుత్వం మీ భర్తకు ఉద్యోగం, మీకు భూమి ఇచ్చింది. ఈ చిన్న లాజిక్ మీరు ఎలా మిస్ అయ్యారు? పవన్ డిమాండ్ చేయకముందే ప్రభుత్వం ఇచ్చి ఉంటే అది ప్రేమ అనుకోవచ్చు. ఆయన అడిగాక ఇచ్చారంటే అది ఆయనపై ఉన్న భయం అనుకోవాలి" అని ఆది వివరించారు. "పవన్ కల్యాణ్ ప్రోద్బలంతోనే కేసు సీబీఐకి వెళ్లింది. ఛార్జిషీట్‌లో పేర్లు మార్చేసి, సీబీఐకే అంతుచిక్కకుండా ఉన్న కేసు గురించి పవన్ ఇంకెంతకాలం పోరాడాలి? తన నెల జీతం కూడా తీసుకోకుండా పిఠాపురంలోని అనాథ పిల్లలకు ఇచ్చే వ్యక్తి, కులమతాలు చూడకుండా రైతులను ఆదుకునే వ్యక్తి ఓట్ల కోసం ఒక అంశాన్ని వాడుకుంటారా? పాలు పోసిన వ్యక్తినే కాటేసే మనస్తత్వం మీకు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. పక్కవాళ్ల మాటలు విని పవన్‌ను విమర్శించడం మానుకోవాలి. పవన్ కాకుండా మీకు ఎవరైనా న్యాయం చేయగలిగితే, నా జీవితంలో జనసేన గురించి మాట్లాడను" అంటూ ఆది సవాల్ విసిరారు. ఈ పరిణామంతో సుగాలి ప్రీతి కేసు మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.



# జూన్ 4లోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలి : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి







**రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

**యాసంగి సీజన్‌కు 24 కోట్ల గన్నీ సంచులు సిద్ధం**

**వర్షాల హెచ్చరికలతో కొనుగోళ్ల వేగంపై అధికారులకు ఆదేశాలు**

**తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై చర్యలు**

**రాష్ట్రవ్యాప్తంగా 8.5 లక్షల మంది రైతులకు రూ.10,500 కోట్ల చెల్లింపులు**

**హన్మకొండ, 28 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జూన్ 4వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, హన్మకొండ, వరంగల్, ములుగు, జనగామ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, బొర్ఖడే హేమంత్ సహదేవ్ రావు, సందీప్ కుమార్ ఝా, డీసీపీ ధార కవితతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలపై మంత్రులకు వివరించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గన్నీ సంచుల కొరత లేదని స్పష్టం చేసిన మంత్రి, యాసంగి సీజన్‌కు అవసరమైన 24 కోట్ల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు అదనపు గన్నీ సంచులను వెంటనే పంపిస్తున్నామని పేర్కొన్నారు. వాతావరణ శాఖ జూన్ 4 తర్వాత వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో, జూన్ 3వ తేదీలోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు, రవాణా, నిల్వ, రైతులకు చెల్లింపుల ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇసుక రవాణాకు వినియోగిస్తున్న లారీలను తాత్కాలికంగా ధాన్యం రవాణాకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే లారీలు, డీసీఎంలను రిక్విజిషన్ చేసి ధాన్యం, మొక్కజొన్న తరలింపునకు వినియోగించాలని ఎస్పీలు, ఆర్టీఏ అధికారులకు సూచించారు. జిల్లాల వారీగా గోదాములలో నిల్వ స్థలాల కేటాయింపుపై పరస్పర సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను ఆదేశించారు. జనగామ జిల్లాకు యాదాద్రి జిల్లాలో, వరంగల్ జిల్లాకు భూపాలపల్లి జిల్లాలో నిల్వ స్థలాలు కేటాయించాలని సూచించారు. అవసరమైతే ప్రైవేట్ గోదాములను కూడా వినియోగించుకోవాలని కలెక్టర్లకు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని, రైతులకు ఇబ్బంది కలిగించేలా తాలు, తరుగు పేరుతో కోతలు విధించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో యాసంగి సీజన్‌కు సంబంధించి 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరో 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8.5 లక్షల మంది రైతులకు రూ.10,500 కోట్ల చెల్లింపులు చేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా చేయకపోయినా రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించే రైస్ మిల్లర్లకు అదనపు బాయిల్డ్ రైస్ టార్గెట్ల కేటాయింపు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆర్డీవోలు, సివిల్ సప్లై అధికారులు, రవాణా, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు పండించిన ఒక్క గింజ కూడా మిగలకుండా కొనుగోలు చేసే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసే రైస్ మిల్లర్లపై తహసీల్దార్లు, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల మధ్య గోదాముల కేటాయింపుల విషయంలో కలెక్టర్లు, పౌర సరఫరాల కమిషనర్ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.


# వినియోగదారుడి హక్కులపై అవగాహన పెరగాలి

**మోసాలకు చెక్ పెట్టాలంటే చైతన్యం అవసరం**

**అనిల్ కాందారి - స్టేట్ క్రైమ్ బ్యూరో**

**హైద్రాబాద్, 28 మే 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రస్తుత సమాజంలో ప్రతి వ్యక్తి ఒక వినియోగదారుడే. ప్రతిరోజూ మనం ఉపయోగించే ఆహార పదార్థాలు, మందులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆన్‌లైన్ సేవలు అన్నీ వినియోగదారుడి జీవితంలో కీలక భాగాలుగా మారాయి. అయితే మార్కెట్ వ్యవస్థ విస్తరించిన కొద్దీ వినియోగదారులపై మోసాలు, నాసిరకం వస్తువుల విక్రయాలు, అధిక ధరల భారం, ఆన్‌లైన్ మోసాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారుడి హక్కులపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశంలో వినియోగదారుల రక్షణ కోసం "కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ -- 2019" అమల్లో ఉంది. ఈ చట్టం ద్వారా వినియోగదారులకు పలు హక్కులు కల్పించబడ్డాయి. భద్రత హక్కు, సమాచారం తెలుసుకునే హక్కు, ఎంపిక హక్కు, ఫిర్యాదు చేసే హక్కు, పరిహారం పొందే హక్కు వంటి అనేక చట్టబద్ధమైన రక్షణలు వినియోగదారులకు ఉన్నాయి. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు పెరగడంతో పాటు సైబర్ మోసాలు కూడా అధికమవుతున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ ప్రకటనలు, తక్కువ ధరల ఆఫర్లు, నకిలీ వెబ్‌సైట్లు, యూపీఐ మోసాలు ప్రజలను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయి. చాలామంది సరైన అవగాహన లేక మోసపోతున్నారని అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా స్టేట్ క్రైమ్ బ్యూరో ప్రతినిధి అనిల్ కాందారి మాట్లాడుతూ, వినియోగదారులు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి వస్తువు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, గడువు తేదీలు పరిశీలించాలని, నాణ్యత గుర్తులు ఉన్నాయో లేదో చూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో అధికారిక వెబ్‌సైట్లు, నమ్మకమైన యాప్స్ ద్వారానే కొనుగోళ్లు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో కనిపించే ఆకర్షణీయ ప్రకటనలను నమ్మి ముందస్తు చెల్లింపులు చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఎలాంటి అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని, బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కన్స్యూమర్ కమిషన్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారానే ఫిర్యాదులు నమోదు చేసే సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. మోసపోయినప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. "వినియోగదారుడే రాజు" అనే నినాదం కేవలం మాటల్లో కాకుండా ప్రతి ఒక్కరి ఆచరణలో ఉండాలని అనిల్ కాందారి పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగితేనే మోసాలను అరికట్టడం సాధ్యమవుతుందని, వినియోగదారుల హక్కులు బలపడితే మార్కెట్ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు.




# క్రీడలతోపాటు అన్నిరంగాల్లో రాణించాలి: బీజేపీ నేత కరణం ప్రహ్లాద రావు

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

క్రీడలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని బిజెపి నేత ప్రహ్లాద రావు అన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని కెవిఎం ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో "స్పోర్ట్స్ మీట్–2026" ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి. అంజయ్య, ప్రిన్సిపాల్ మహేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పెన్నప్ప, మండల నేతలు దాదాపు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



# ఈ చిన్న చిన్న అలవాట్లతో పిల్లల జ్ఞాపకశక్తి పెరుగుతుంది..!



పిల్లలు చదివిన విషయాలను సులభంగా గుర్తుంచుకోవాలంటే సరైన అభ్యాస పద్ధతులు అనుసరించాలి. జ్ఞాపకశక్తిని పెంచే కొన్ని ముఖ్యమైన వ్యూహాలు ఉన్నాయి. వీటిని పాటించడం వల్ల చదువు మరింత ప్రభావవంతంగా మారుతుంది. చురుకైన అభ్యాసం, విజువల్ లెర్నింగ్, మైండ్ మ్యాప్స్, ఫ్లాష్‌కార్డ్స్ వంటివి పిల్లల మెదడు పనితీరును మెరుగుపరిచి ఎక్కువ కాలం గుర్తుంచుకునేలా చేస్తాయి. పిల్లలు చదివిన విషయాలను సులభంగా గుర్తుంచుకోవాలంటే సరైన అభ్యాస పద్ధతులు అవసరం. కొన్ని సాధారణ అలవాట్లు మెదడు పనితీరును మెరుగుపరచి, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. సమర్థవంతమైన అభ్యాసం కోసం జ్ఞాపకశక్తిని మెరుగుపర్చే వ్యూహాలను అనుసరించడం చాలా అవసరం. చురుకైన అభ్యాసం, విజువలైజేషన్, చిన్న గుర్తింపు పదాలు వంటివి చదివిన విషయాలను మెదడులో నిలుపుకోవడానికి సహాయపడతాయి. ఈ పద్ధతులు చదువును మరింత సమర్థవంతంగా, ఆనందదాయకంగా మార్చేస్తాయి. నిత్యం ఒక నిర్దిష్ట సమయాన్ని చదువుకు కేటాయించడం వల్ల పిల్లలు క్రమశిక్షణతో చదువుకునే అలవాటు పెంచుకుంటారు. ఇది విషయాలను సులభంగా గుర్తుంచుకోవడానికి సహాయపడుతుంది. క్రమం తప్పకుండా చదివితే మేమరీ పవర్ మెరుగుపడుతుంది. క్లిష్టమైన విషయాలను చిన్న పదాలతో, ప్రాసలతో లేదా గుర్తించదగిన విధంగా రూపొందించుకోవడం వల్ల పిల్లలు సులభంగా అర్థం చేసుకోవచ్చు. మానసిక ఉపాయాలు, గుర్తింపు పదాలు విద్యార్థులకు చదివిన విషయాలను మరింత సులభంగా గుర్తుంచుకునేలా చేస్తాయి. చర్చలు, బోధన, ఆచరణాత్మక పద్ధతులు పిల్లల చదువును మరింత ప్రభావవంతంగా మారుస్తాయి. చురుకైన అభ్యాసం ద్వారా పిల్లలు ఎక్కువ కాలం విషయాలను గుర్తుంచుకోవచ్చు. ఇతరులకు నేర్చుకున్న విషయాలను బోధించడం మరింత మేలు చేస్తుంది. ఒకేసారి ఎక్కువ విషయాలను చదవడం కన్నా, చిన్న చిన్న ముక్కలుగా విభజించి చదివితే మెదడు వాటిని సులభంగా గుర్తుంచుకోగలదు. దీనిని చంకింగ్ అనే వ్యూహంగా పిలుస్తారు. ఇది ఎక్కువ సమాచారం మెదడులో నిల్వ ఉండేలా చేస్తుంది. ఫ్లాష్‌కార్డ్స్ ద్వారా ముఖ్యమైన విషయాలను పిల్లలు సులభంగా గుర్తుంచుకోవచ్చు. ముఖ్యమైన సమాచారాన్ని చిన్న కార్డులపై రాసి తరచూ పునర్విమర్శ చేయడం జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. పిల్లలు విజువల్‌గా ఆలోచించేలా ప్రోత్సహించాలి. మైండ్ మ్యాప్స్, చిత్రాలు, గమనికలు వంటివి ఉపయోగించడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదివిన విషయాలను ఒక కథలా మానసికంగా ఊహించుకోవడం అవగాహన పెంచుతుంది. తరచూ పునర్విమర్శ చేయడం ద్వారా పిల్లలు నేర్చుకున్న విషయాలను ఎక్కువ కాలం గుర్తుంచుకోవచ్చు. స్పేస్డ్ రిపిటిషన్ అనే పద్ధతి ద్వారా చదివిన అంశాలను సమయానుసారం మళ్లీ మళ్లీ పునర్విమర్శ చేయాలి. నిద్ర, సరైన ఆహారం, వ్యాయామం మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఆరోగ్యంగా ఉండే పిల్లలు ఎక్కువ ఏకాగ్రతతో చదవగలుగుతారు. మంచి జీవనశైలి మెదడు చురుకుగా ఉండేలా చేస్తుంది. ఈ అలవాట్లు పిల్లలకు చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. సరైన పద్ధతులను పాటిస్తే పిల్లలు మరింత ప్రభావవంతంగా అభ్యసించగలరు.


# కంది పప్పు అసలైనదేనా?

చాలా మంది ఇష్టంగా తినే వంటకాల్లో పప్పుచారు, సాంబారు ముఖ్యమైనవి. ఇవి లేకుండా ఏ ఇంట్లోనూ భోజనం పూర్తి కాదు. అందువల్ల, చాలా మంది వంటలు తయారు చేయడానికి కంది పప్పును ఉపయోగిస్తుంటారు. ఇందులో ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో వంటకాలకు ఎక్కువగా ఉపయోగించే పదార్థాల్లో కందిపప్పు ఒకటి. దీనితో తయారు చేసిన రసం, సాంబారు లేకుండా ఏ ఇంట్లోనూ భోజనం పూర్తి కాదు. అందువల్ల, చాలా మంది వంటలు తయారు చేయడానికి కంది పప్పును ఉపయోగిస్తుంటారు. ఇందులో ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో కొంతమంది వ్యాపారులు అధిక లాభాలకు అలవాటుపడి రసాయనిక రంగు వేసిన కల్తీ పప్పును అమ్ముతున్నారు. ఈ రంగు పప్పుధాన్యాలను తినడం వల్ల అనేక ఆరోగ్య దుష్ప్రభావాలు ఉంటాయి. అందువల్ల పప్పు కొనడానికి ముందు దాని స్వచ్ఛతను తనిఖీ చేయడం చాలా ముఖ్యం. నకిలీ పప్పును గుర్తించడానికి ఇక్కడ చిట్కాలు ఉన్నాయి. సహజ కంది పప్పు పరిమాణంలో చిన్నగా, లేత పసుపు రంగులో ఉంటుంది. హైబ్రిడ్ కాయధాన్యాలు తక్కువ పోషక విలువలను కలిగి ఉంటాయి. పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి. మార్కెట్లో కంది పప్పు కొనే ముందు చేయవలసిన పని వాటిని మీ చేతిలో వేసి రుద్దడం. ఇలా రుద్దినప్పుడు పప్పు గోధుమ రంగులోకి మారితే అది కల్తీ అని అర్థం. రంగు మారకపోతే అది స్వచ్ఛమైనదని ఖచ్చితంగా చెప్పవచ్చు. కంది పప్పు నిజమైనదో కాదో తెలుసుకోవడానికి మరో టెస్ట్ కూడా చేయవచ్చు. గోరువెచ్చని నీటిలో ఐదు నిమిషాల పాటు కాసింత కంది పప్పు నానబెట్టాలి. నీరు పసుపు రంగులోకి మారితే, ఈ పప్పు కల్తీ అని అర్థం చేసుకోవాలి. పప్పు స్వచ్ఛతను పరీక్షించడానికి హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని కూడా ఉపయోగించవచ్చు. ఒక టేబుల్ స్పూన్ కంది పప్పుని నీటిలో కలపాలి. దానికి రెండు చుక్కల హైడ్రోక్లోరిక్ ఆమ్లం కలపాలి. ఈ సమయంలో పప్పు వేరే రంగులోకి మారితే అది కల్తీ అని అర్థం. నకిలీ పప్పు కూడా చౌక ధరకు లభిస్తుంది. అందువల్ల శుభ్రమైన, మధ్యస్థ పరిమాణంలో ఉన్న పప్పు ధాన్యాలను మాత్రమే ఎంచుకోవాలి. తక్కువ ధరకు అమ్ముతుంటే, దాని నాణ్యత బాగాలేదని అర్థం చేసుకుని.. దానిని కొనుగోలు చేయకుండా జాగ్రత్త తీసుకోవాలి.



# ఈ అలవాటును వెంటనే మానుకోండి..!

గోళ్లు కొరకడం చాలా మందికి అలవాటుగా మారింది. కానీ జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఈ అలవాటు అనేక ప్రతికూల ప్రభావాలను కలిగించవచ్చు. శని గ్రహానికి సంబంధించి గోళ్లు కొరికే అలవాటు శని దోషాన్ని పెంచే అవకాశం ఉంది. ఇది ఆర్థిక, ఆరోగ్య, మానసిక సమస్యలకు కారణం అవుతుందని జ్యోతిష్యులు చెబుతున్నారు. గోళ్లు కొరికే అలవాటు చాలా మందికి ఉంటుంది. ఇది చిన్నపిల్లలు మాత్రమే కాదు.. పెద్దల్లో కూడా కనిపించే సమస్య. అయితే జ్యోతిషశాస్త్రం ప్రకారం ఈ అలవాటు శని గ్రహాన్ని బలహీనపరుస్తుందని చెబుతారు. ఎందుకంటే శనిని గోళ్లకు సంబంధించిన గ్రహంగా పరిగణిస్తారు. జ్యోతిషశాస్త్రం ప్రకారం.. ఒక వ్యక్తి గోళ్లు కొరికితే అతని జాతకంలో శని దోషం ఏర్పడుతుంది. అంటే శనికి సంబంధించి ప్రతికూల ప్రభావం ఆ వ్యక్తిపై పడుతుంది. శని బలహీనపడితే జీవితంలో అనేక ఆటంకాలు, ఆర్థిక సమస్యలు, మానసిక ఒత్తిడి పెరుగుతాయి. జ్యోతిషశాస్త్రంలో శనిని గోళ్లు, ఎముకలతో సంబంధం ఉన్న గ్రహంగా చూస్తారు. అలాంటి పరిస్థితిలో గోళ్లు కొరికితే శని మరింత బలహీనపడుతుంది. దీని ప్రభావంగా ఉద్యోగ జీవితం, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు ప్రభావితమవుతాయి. గోళ్లు కొరకడం వల్ల శని మాత్రమే కాదు.. రాహువు, కేతువుల ప్రభావం కూడా పడుతుంది. వీటి కారణంగా వ్యక్తి అనేక అనుకోని సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అనారోగ్యం, మానసిక ఒత్తిడి, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వంటి పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంది. జ్యోతిష్యుల అభిప్రాయం ప్రకారం గోళ్లు కొరకడం వల్ల సూర్య గ్రహం బలహీనపడుతుంది. సూర్యుడు అధికారం, పరిపాలన, గౌరవాన్ని సూచించే గ్రహం. ఇది దెబ్బతింటే, వ్యక్తికి కెరీర్‌లో అవరోధాలు ఎదురవుతాయి. వ్యాపారం, ఉద్యోగం కోల్పోవడం, ఇతరులను ప్రభావితం చేసే స్థాయిని కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. గోళ్లు కొరకడం వల్ల లక్ష్మీదేవికి కోపం వస్తుందని చెబుతారు. లక్ష్మీదేవి సంపదకు సూచిక. గోళ్లు కొరికే అలవాటు ఉంటే ఇంటి శ్రేయస్సు దెబ్బతింటుందని నమ్ముతారు. దీని వల్ల ఆర్థిక సమస్యలు పెరిగే అవకాశముంటుంది. గోళ్ళను కొరకడం వల్ల వ్యక్తి ఆర్థికంగా నష్టపోతాడని, డబ్బు నిలవదని కొన్ని విశ్వాసాలు చెబుతున్నాయి. అలాంటి అలవాట్లు ఉండకూడదని పెద్దవారు సలహా ఇస్తారు. ఇది ఆరోగ్యపరమైన సమస్యలకు కూడా దారితీస్తుంది. గోళ్లు కొరికే అలవాటు ఆరోగ్యానికి మాత్రమే కాదు.. జ్యోతిష్య పరంగా కూడా అనేక ప్రతికూల ప్రభావాలను కలిగించవచ్చని చెబుతారు. శని, రాహు, కేతువుల బలహీనత, ఆర్థిక ఇబ్బందులు, కెరీర్‌లో ఆటంకాలు వంటి సమస్యలు రావచ్చు. అందువల్ల ఈ అలవాటును నివారించడం మంచిది.



# ఇంట్లోనే చిల్లీ ఎగ్స్ రెసిపీని చేయండి..!

ఎగ్స్ తో చేసే వంటకాల్లో చిల్లీ ఎగ్స్ చాలా ప్రత్యేకమైనది. ఇది ఘాటుగా, క్రిస్పీగా, రెస్టారెంట్ స్టైల్‌లో రుచికరంగా ఉంటుంది. కొద్దిపాటి చిట్కాలు పాటిస్తే ఇంట్లోనే రెస్టారెంట్ రుచిని ఆస్వాదించొచ్చు. ఈ రెసిపీ పిల్లలు, పెద్దలందరికీ నచ్చేలా ఉంటుంది. ఎగ్ వంటకాలలో చిల్లీ ఎగ్స్ ఒక ప్రత్యేకమైన వంటకం. గుడ్లతో ఎన్నో రకాల రుచికరమైన వంటకాలు చేయవచ్చు, అయితే రెస్టారెంట్ స్టైల్లో తయారుచేసే చిల్లీ ఎగ్స్ అయితే మరింత ఘాటుగా, రుచిగా ఉంటుంది. ఇంట్లోనూ అదే రుచిని పొందాలంటే కొన్ని చిన్న చిట్కాలను పాటిస్తే చాలు. ఈ రుచికరమైన వంటకాన్ని ఓసారి ప్రయత్నిస్తే పిల్లలతో పాటు పెద్దలకూ కూడా ఎంతో నచ్చుతుంది. గుడ్ల మిశ్రమం కోసం కావాల్సిన పదార్థాలు:గుడ్లు - 6/ మైదా పిండి - 1.5 టేబుల్ స్పూన్/కార్న్ ఫ్లోర్ - 1 టేబుల్ స్పూన్/నీరు - 4-5 టేబుల్ స్పూన్లు/పచ్చిమిర్చి తరుగు - 1 టీస్పూన్/కారం - టీస్పూన్/ఉప్పు - రుచికి సరిపడా/చిల్లీ ఎగ్స్ ఫ్రై కోసం కావాల్సిన పదార్థాలు: నూనె - 4 టేబుల్ స్పూన్లు/అల్లం తరుగు - టేబుల్ స్పూన్/వెల్లుల్లి తరుగు -టేబుల్ స్పూన్/ఉల్లిపాయ తరుగు -4 టేబుల్ స్పూన్లు/పచ్చిమిర్చి చీలికలు - 2/%క్యాప్సికం ముక్కలు - కప్పు/చిల్లీ సాస్ / షేజ్వాన్ సాస్ - 1 టేబుల్ స్పూన్/రెడ్ చిల్లీ సాస్ -1 టేబుల్ స్పూన్/గ్రీన్ చిల్లీ సాస్ - 1 టేబుల్ స్పూన్/ వేడి నీళ్లు - కప్పు/డార్క్ సోయా సాస్ - 1 టీస్పూన్/వెనిగర్ - 1 టీస్పూన్/మిరియాల పొడి - 1 టీస్పూన్/అరోమాటిక్ పౌడర్ - 1 టీస్పూన్/వైట్ పెప్పర్ పౌడర్ - టీస్పూన్/చక్కెర - 1 టీస్పూన్/ ఉప్పు -రుచికి సరిపడా/ కొత్తిమీర తరుగు- అలంకరణ కోసం తయారీ విధానం: ముందుగా ఒక గిన్నెలో గుడ్లను పగలగొట్టి వేసుకోవాలి. అందులో పచ్చిమిర్చి తరుగు, కారం, ఉప్పు వేసి బాగా బీట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని స్టీమ్ చేసుకోవాలి కాబట్టి ముందుగా ఒక కేక్ టిన్ తీసుకుని నెయ్యి లేదా నూనెతో గ్రీస్ చేయాలి. ఇందులో గుడ్ల మిశ్రమాన్ని పోసి సిద్ధం చేసుకోవాలి. స్టీమ్ చేయడం కోసం పెద్ద గిన్నెలో రెండు గ్లాసుల నీరు పోసి స్టాండ్ ఉంచాలి. ఈ స్టాండ్ పై కేక్ టిన్ పెట్టి గిన్నెకు మూత పెట్టి హై ఫ్లేమ్‌లో 15 నిమిషాలు స్టీమ్ చేయాలి. పూర్తిగా ఉడికిన తర్వాత మిశ్రమాన్ని చల్లబరచి, టిన్ నుంచి బయటకు తీసి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్ ఫ్లోర్ వేసి కొద్దికొద్దిగా నీరు పోసి మిశ్రమాన్ని బాగా కలపాలి. ఇది చాలా మందంగా లేకుండా.. మరీ పల్చగా కూడా కాకుండా ఉండాలి. ఇప్పుడు స్టవ్‌పై ఒక పాన్ పెట్టి నూనె వేడిచేయాలి. స్టీమ్ చేసిన గుడ్ల ముక్కలను పిండిలో ముంచి వేడి నూనెలో వేయాలి. ఇవి గోల్డెన్ బ్రౌన్, క్రిస్పీగా అయ్యాక బయటకు తీసి ఉంచుకోవాలి. ఇప్పుడు స్టవ్‌పై పాన్ పెట్టి నాలుగు టేబుల్ స్పూన్లు నూనె వేడిచేయాలి. అందులో అల్లం, వెల్లుల్లి తరుగు వేసి బాగా వేయించాలి. ఇప్పుడు ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి చీలికలు, క్యాప్సికం ముక్కలు వేసి వేయించాలి. అవి కాస్త మెత్తబడిన తర్వాత చిల్లీ సాస్, షేజ్వాన్ సాస్, రెడ్ చిల్లీ సాస్, గ్రీన్ చిల్లీ సాస్, వేడి నీరు వేసి బాగా కలపాలి. సాసులు కాస్త చిక్కబడిన తర్వాత డార్క్ సోయా సాస్, వెనిగర్, మిరియాల పొడి, అరోమాటిక్ పౌడర్, వైట్ పెప్పర్, చక్కెర, ఉప్పు వేసి స్టవ్ హై ఫ్లేమ్‌లో ఉంచి కలపాలి. చివరగా క్రిస్పీగా ఫ్రై చేసిన గుడ్ల ముక్కలు ఇందులో వేసి మిక్స్ చేయాలి. ఒక్క నిమిషం వేయించాక కొత్తిమీర చల్లి స్టవ్ ఆఫ్ చేయాలి. ఇంతే సింపుల్.. రెస్టారెంట్ స్టైల్ స్పైసీ, టేస్టీ చిల్లీ ఎగ్స్ రెసిపీ రెడీ అయ్యింది. ఇలా ఇంట్లోనే రెస్టారెంట్ లెవల్ స్పైసీ అండ్ క్రిస్పీ చిల్లీ ఎగ్స్ రెసిపీని సులభంగా తయారు చేయండి. ఇంకెందుకు ఆలస్యం ఇది ఓసారి ప్రయత్నించి మీ కుటుంబ సభ్యులకు సర్ప్రైజ్ ఇవ్వండి.



# టూత్ బ్రష్ ఎన్ని రోజులకు మారుస్తున్నారు?

చాలా మంది రోజుల తరబడి ఒకే బ్రష్‌ను ఉపయోగిస్తుంటారు. ఈ పద్ధతి సరైనది కాదు. కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్రష్‌లను మార్చాలి. బ్రష్‌లు అరిగిపోయిన తర్వాత కూడా చాలా మంది వాటిని ఉపయోగించడం కొనసాగిస్తారు. ఈ రకమైన బ్రష్‌ను అస్సలు ఉపయోగించకూడదు. నోటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం అంటే కేవలం పళ్ళు తోముకోవడం మాత్రమే కాదు. నోటి ఆరోగ్యం కోసం చాలా మంది సాల్టెడ్ టూత్‌పేస్ట్‌తో బ్రష్ చేసుకుంటారు. కానీ అసలు సమస్య వేరే చోట ఉంది. నోటి ఆరోగ్యం చాలావరకు టూత్ బ్రష్ మీద ఆధారపడి ఉంటుందని దంత వైద్యులు అంటున్నారు. చాలా మంది రోజుల తరబడి ఒకే బ్రష్‌ను ఉపయోగిస్తుంటారు. ఈ పద్ధతి సరైనది కాదు. కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్రష్‌లను మార్చాలి. బ్రష్‌లు అరిగిపోయిన తర్వాత కూడా చాలా మంది వాటిని ఉపయోగించడం కొనసాగిస్తారు. ఈ రకమైన బ్రష్‌ను అస్సలు ఉపయోగించకూడదు. ఏదైనా అంటు వ్యాధి నుండి కోలుకున్న తర్వాత మీ టూత్ బ్రష్‌ను మార్చడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఆ వ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియా లాలాజలంలో ఉండి, బ్రష్ పొడవైన కమ్మీలలో ఎక్కువ కాలం ఉంటుంది. ఆ కుంచె నుంచి ఆ వ్యాధి తరువాత మళ్ళీ వ్యాపిస్తుంది. దంతాల వెలికితీత తర్వాత లేదా నోటి లోపల ఏ రకమైన శస్త్రచికిత్స జరిగినా.. ఆ తర్వాత మీ టూత్ బ్రష్‌ను ఖచ్చితంగా మార్చడం కూడా మర్చిపోవద్దు. ఇటీవల, దంతాలను తోముకోవడానికి ఎలక్ట్రిక్ టూత్ బ్రష్‌ల వాడకం అందుబాటులోకి వచ్చింది. ఈ బ్రష్ హెడ్‌ను కూడా ప్రతి రెండు నుండి మూడు నెలలకు ఒకసారి మార్చాలి. సాధారణ బ్రష్‌ల కంటే ఇలాంటి బ్రష్‌ల ముళ్ళగరికెలు త్వరగా అరిగిపోతాయని వైద్యులు అంటున్నారు.




# వేసవిలో రోజంతా బూట్లు ధరించే వారు అలర్ట్..



కొంతమంది తమ దుస్తులకు సరిపోయేలా బూట్లు కొని ధరిస్తారు. కానీ వేసవిలో కూడా కొంతమంది రోజంతా బూట్లు ధరించి తిరుగుతుండటం మీరు చూసే ఉంటారు. వేసవిలో బూట్లు ఎక్కువగా ఇష్టపడే వారు ఈ విషయాలు కొన్ని తెలుసుకుంటే మంచిది. వేసవిలో బూట్లు వేసుకునే వారి పాదాలకు గాలి అంతగా తగలదు. మార్కెట్‌లోకి వచ్చే రంగురంగుల, ఆకర్షణీయమైన స్టైలిష్ షూ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. అయితే బూట్లలో కూడా చాలా రకాలు ఉంటాయి. కొంతమంది తమ దుస్తులకు సరిపోయేలా బూట్లు కొని ధరిస్తారు. కానీ వేసవిలో కూడా కొంతమంది రోజంతా బూట్లు ధరించి తిరుగుతుండటం మీరు చూసే ఉంటారు. వేసవిలో బూట్లు ఎక్కువగా ఇష్టపడే వారు ఈ విషయాలు కొన్ని తెలుసుకుంటే మంచిది. వేసవిలో బూట్లు వేసుకునే వారి పాదాలకు గాలి అంతగా తగలదు. చాలా మంది రోజంతా బూట్లు ధరిస్తారు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా సాక్స్‌లను ధరించి నడవకూడదు. ఎండ, వేడి కారణంగా పాదాలు విపరీతంగా చెమట పడుతుంటాయి. బూట్లు బిగుతుగా ఉండటం వల్ల పాదాలు దుర్వాసన వస్తాయ. ఈ సీజన్‌లో వీలైనంత వరకు తోలు బూట్లు ధరించడం మానుకోవాలి. వేసవిలో చాలా బిగుతుగాలేని సౌకర్యవంతంగా ఉండే బూట్లు లేదా పాదరక్షలను వినియోగించడం మంచిది. బిగుతుగా ఉండే బూట్లు ధరించడం వల్ల రక్త ప్రసరణ సమస్యలు, వాపు, పాదాలలో నొప్పి వస్తుంది. గాలి ప్రసరణ లేకుండా రోజంతా పాదాలను బూట్లలో ఉంచడం వల్ల బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, ఫంగస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి ఇలాంటి సమస్యలను నివారించడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. అందువల్ల తేలికైన, గాలి వెళ్ళే పాదరక్షలను ధరించడం ఉత్తమం. మీరు బూట్లు ధరిస్తే, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. బూట్లు, సాక్స్‌లను సరిగ్గా శుభ్రం చేయకపోతే, పాదాలకు చర్మ వ్యాధులకు దారితీస్తుంది. వేసవిలో బరువైన బూట్లు ధరించ కూడదు. దీనివల్ల పాదాలు ఎక్కువగా చెమట పడతాయి. ఎల్లప్పుడూ క్లాత్ బూట్లు, కాటన్ సాక్స్ మాత్రమే ధరించాలి. ఈ సమయంలో వీలైనంత వరకు నైలాన్ లేదా పాలిస్టర్‌తో చేసిన సాక్స్‌లను ధరించడం మానుకోండి.

# మైఖేల్ జాక్సన్ పాటకు శ్రద్ధా కపూర్ హుషారైన స్టెప్పులు

**నైట్ డ్రెస్‌లో డ్యాన్స్ చేసి అభిమానులను ఆకట్టుకున్న శ్రద్ధా**
**వీడియోను రాహుల్ మోదీ చిత్రీకరించినట్లు ప్రచారం**
**"ఇలా డ్యాన్స్ చేయించే వ్యక్తిని వెతుక్కోండి" అంటూ క్యాప్షన్**
**రాహుల్ మోదీతో ప్రేమలో ఉన్నారంటూ కొనసాగుతున్న ప్రచారం**
**'స్త్రీ 2' విజయంతో వరుస ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్న హీరోయిన్**



బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ డ్యాన్స్ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. పాప్ దిగ్గజం మైఖేల్ జాక్సన్ క్లాసిక్ సాంగ్ 'డోంట్ స్టాప్ టిల్ యూ గెట్ ఇనఫ్'కు శ్రద్ధా తన ఇంట్లో నైట్ డ్రెస్‌లోనే ఎంతో హుషారుగా స్టెప్పులు వేసి అభిమానులను అలరించింది. ఈ వీడియోను ఆమె ప్రియుడిగా ప్రచారంలో ఉన్న సినీ రచయిత రాహుల్ మోదీ చిత్రీకరించినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన శ్రద్ధా.. "మిమ్మల్ని ఇలా డ్యాన్స్ చేయించే వ్యక్తిని వెతుక్కోండి" అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ జత చేయడంతో వీరిద్దరి బంధంపై మరింత చర్చ మొదలైంది. గత కొంతకాలంగా శ్రద్ధా కపూర్, రాహుల్ మోదీ ప్రేమలో ఉన్నారంటూ వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ముంబైలో పలుమార్లు డిన్నర్ డేట్‌లకు వెళ్లిన సందర్భాల్లో వీరిద్దరూ కెమెరాలకు చిక్కారు. గతంలో వీరిద్దరూ విడిపోయారంటూ రూమర్లు వచ్చినప్పటికీ, 2024 డిసెంబర్‌లో రాహుల్‌తో కలిసి వడా పావ్ తింటున్న ఫోటోను శ్రద్ధా సోషల్ మీడియాలో పంచుకుని ఆ వార్తలకు చెక్ పెట్టారు. ఇప్పటివరకు తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించకపోయినా, ఇద్దరూ పరోక్షంగా తమ అనుబంధాన్ని వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, 2024లో విడుదలైన 'స్త్రీ 2' చిత్రంతో శ్రద్ధా కపూర్ భారీ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఆమె 'పహాడ్‌పంగిరా', 'నాగిన్', 'ఈత' వంటి పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

# ఎన్ని తరాలు మారినా ఆ తారక రాముని ప్రభావం చెరిగిపోదు'



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి నేడు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ఆయన అభిమానులు, ప్రముఖులు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడుతూ, ఆయనతో కలిసి దిగిన ఒక అరుదైన ఫొటోను పంచుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి తన పోస్ట్‌లో.. "ఎన్ని తరాలు మారినా ఆ తారక రాముని ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదు. తెరపై అనేక పాత్రలను సజీవంగా ఆవిష్కరించిన మహానటుడిగా.. ప్రజాజీవితంలో తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా.. అందరి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన శ్రీ నందమూరి తారక రామారావు గారు చిరస్మరణీయులు. ఇటీవల ఎన్టీఆర్ జాతీయ పురస్కారం నాకు లభించడం కూడా ఎంతో ప్రత్యేకమైన గౌరవంగా భావిస్తున్నాను. అది ఆయనపై నాకు ఉన్న గౌరవానికి మరింత విలువైన గుర్తింపుగా నిలిచిపోతుంది. ఆ మహనీయుని జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ.." అని తన నివాళిని అర్పించారు.

# ఆ ఆరు పాత్రల్లో 'పెద్ది'లోని అప్పలసూరే బెస్ట్: జగపతి బాబు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న గ్రామీణ యాక్షన్ డ్రామా 'పెద్ది'లో తాను పోషించిన అప్పలసూరి పాత్ర తన కెరీర్‌లోనే అత్యుత్తమమైనదని నటుడు జగపతి బాబు అన్నారు. నటన, గెటప్ పరంగా ఈ పాత్ర తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని, 'లెజెండ్' తర్వాత తాను గుర్తుపెట్టుకున్న ఆరు ముఖ్య పాత్రల జాబితాలో 'పెద్ది'లోని అప్పలసూరి పాత్రకే నంబర్ 1 స్థానం ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ పాత్ర గెటప్, రూపకల్పన విషయంలో పూర్తి క్రెడిట్ దర్శకుడు బుచ్చి బాబుకే దక్కుతుందని జగపతి బాబు తెలిపారు. "జాతీయ అవార్డు గ్రహీత, మేకప్ ఆర్టిస్ట్ రషీద్ ప్రత్యేక శ్రద్ధతో ఈ లుక్‌ను డిజైన్ చేశారు. ఆ గెటప్ వేసుకున్నప్పుడే ఈ పాత్ర అద్భుతంగా ఉండబోతోందని అర్థమైంది. రామ్ చరణ్ సినిమాలో ఈ పాత్ర చేయడం మరింత ఆనందాన్ని ఇచ్చింది" అని ఆయన వివరించారు. ఇప్పటికే జగపతి బాబు తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేసుకున్నారు. ఇటీవల విడుదలైన 'పెద్ది' ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పింది. గ్రామీణ క్రీడా నేపథ్యంతో సాగే ఈ కథలో రామ్ చరణ్ 'పెద్ది' అనే బహుముఖ ప్రతిభావంతుడైన అథ్లెట్‌గా, అద్భుతమైన ఫిజిక్‌తో కనిపించనున్నారు. చెర్రీ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# భాగ్యశ్రీ బోర్సే గురించి అలాగే అనుకుంటున్నారు మరి!

**గ్లామరస్ బ్యూటీగా భాగ్యశ్రీ**
**సక్సెస్ లు లేకపోయినా తగ్గని క్రేజ్**
**అందంలో ఆమె తరువాతనే అంటున్న యూత్**
**'లెనిన్'పై ఆశలు పెట్టుకున్న భాగ్యశ్రీ**
**'పెద్ది'లో ఆమె కూడా ఉంటే బాగుండేదంటున్న ఫ్యాన్స్**

భాగ్యశ్రీ బోర్సే .. పాల సరస్సులో పూసిన తెల్లకలువలాంటి అందం. అమరశిల్పి జక్కన ఊహకి కూడా అందని శిల్పం. మబ్బులను .. మెరుపులను కలిపి చేసినట్టుగా కనిపించే రూపం. చోళులు .. చాళుక్యుల కాలం నాటి శిల్పాల వరుసలో తప్ప, ఈ మధ్య కాలంలో ఎవరూ ఎక్కడా చూడని ఒక లావణ్య విశేషం. విశాలమైన కళ్లతో విన్యాసాలు చేస్తూ ఆమె యూత్ హృదయాలను కొల్లగొట్టేస్తోంది. అలాంటి భాగ్యశ్రీ బోర్సే గురించి మాట్లాడుకోని కుర్రాళ్లు ఉండరనే చెప్పాలి. తెరపై భాగ్యశ్రీని చూసిన కుర్రాళ్లంతా ఈ అమ్మాయికి నటన తెలియక పోయినా ఫరవాలేదు. అలా తెరపై కనిపిస్తూ ఉంటే చాలానే అనుకుంటారు. అందువల్లనే పెద్దగా సక్సెస్ లు లేకపోయినా, అవకాశాలు మాత్రం వెతుక్కుంటూనే వస్తున్నాయి. వచ్చే నెల చివరి వారంలో ఈ సుందరి 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే ఒక టాక్ బలంగానే వినిపిస్తోంది. అయితే ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, 'పెద్ది' సినిమాలో భాగ్యశ్రీ కూడా మెరిసి ఉంటే బాగుండేదనే ఒక టాక్ ఇప్పుడు షికారు చేస్తోంది. 'పెద్ది'లో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా, ఐటమ్ సాంగ్ లో శృతిహాసన్ సందడి చేయనుంది. మార్కెటింగ్ పరంగా చూసుకుంటే, మేకర్స్ నిర్ణయం సరైనదే అయినా, గ్లామర్ పరంగా చూసుకుంటే, భాగ్యశ్రీ కూడా ఎక్కడో ఒక చోట మెరిసే ఛాన్స్ ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చరణ్ తరువాత సినిమాలోనైనా ఈ బ్యూటీకి ఛాన్స్ దొరుకుతుందేమో చూడాలి మరి.